జనవరి 2021

రు. 20/-

# చైతన్యం

సంకల్ప బలం

## సామాజిక విలువల మాసపత్రిక




# 2021

కరోనా రహిత ప్రపంచాన్ని కాంక్షిస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం



డిసెంబరు 21 న ఆకాశంలో కనువిందు చేసిన బృహస్పతి శని గ్రహాలు



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

# చైతన్యం

సంకల్ప బలం

**సామాజిక విలువల మాస పత్రిక**

సంపుటి -10 జనవరి 2021 సంచిక - 4

## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| వైద్యో నారాయణో హరి: | 6 |
| ఇదీ ఓ సమస్యే | 8 |
| వేదులాన్వయు పలుకు | 10 |
| పూరీ జగన్నాథస్వామి వైభవం | 11 |
| సప్త మోక్ష నగరాలు | 16 |
| 2020 | 20 |
| 116 కందాల్లో సుందరకాండ | 21 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 24 |
| ప్రేమంటే ఇంతే | 29 |
| భయం | 32 |
| షాహుకారు | 39 |
| నవవిధ భక్తులు | 41 |
| మా ఊరి నందుల కథ | 43 |
| భాగవతులతో అనుబంధం | 44 |
| గడి - నుడి | 45 |
| లలితా గీతాల తృష్ణ - డా.వడ్డేపల్లి కృష్ణ | 47 |


రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# 2021 నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజలంతా ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న కొత్త సంవత్సరం - 2021 వచ్చేసింది. 2021 ప్రజలందరినీ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ,సుఖ సంతోషాలతో ఉంచుతుందని, ప్రజలంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. 2020 సంవత్సరంలో ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. 'కరోనా' మహమ్మారి ప్రపంచంలోని ప్రజలందరినీ భయభ్రాంతులకు గురి చేసింది. ఒక పక్క ఎప్పుడూ ఇంటిపట్టున కూడా ఉండని వాళ్ళని కుటుంబంతో కలిసి ఉండి, కుటుంబ బాధ్యతలు పంచుకునేటట్లుగా చేసింది. ప్రజలలో ఒక క్రమ పద్ధతిని, శుభ్రతను పాటించడం, ఖర్చులలో తగు జాగ్రత్తలు పాటించడం, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడం ఇటువంటివి అన్నీ కరోనా నేర్పించింది అనడంలో సందేహం లేదు. కానీ మరో పక్క కరోనా బారిన పడి ఎంతో మంది ప్రముఖుల దగ్గరనుండి, సామాన్యుడి వరకు ప్రాణాలు కోల్పోవడంతో, కుటుంబాలు విషాదంలో మునిగి పోయాయి. పరిశ్రమల దగ్గర నుండి ఎన్నో మూతబడి, ఎంతో మంది ఉద్యోగాలు లేక ఇబ్బందుల పాలవుతున్నారు. అమెరికా వంటి దేశాలలో అయితే ఉద్యోగం పోయిన వారికి 600 డాలర్లు ఇస్తోంది. కానీ మన ఇండియాలో అయితే ఓట్ల కోసం ఇచ్చినట్టుగా పేదవాడికి, డీఏ లు పెంచుకోవడానికి ఇచ్చే ప్రాధాన్యత అసలు ప్రజలకు ఏది అవసరమో అందుకు ప్రభుత్వం సొమ్మును వినియోగించడం లేదని చాలామంది ఆరోపణ. 'కరోనా' మహమ్మారి నుండి ప్రజలను కాపాడే 'టీకా'ను ఫైజర్ కంపెనీ వాళ్ళు కనిపెట్టారు. అలాగే 'ఫైజర్' తో పాటు 'మోడర్నా' వేక్సినేషన్ కూడా ప్రజలకు ఇవ్వడం మొదలుపెట్టారు. అదే విధంగా ఇండియాలో కూడా కోవిడ్ షీల్డ్ మరియు కొవేక్సిన్ కూడా త్వరలో ప్రారంభించ బోతున్నారు. వీటి వల్ల ఉపశమనం పొందుతారని ఆశిద్దాం. ప్రస్తుతం అమెరికాలో కూడా కరోనా వ్యాధి ఎక్కువగానే ఉంది. ఓ పక్క వ్యాక్సిన్ వచ్చినా ఇంకా అందరికీ ఇవ్వడం జరగలేదు. అత్యవసరంగా ఎవరికి అవసరమో (ఫ్రంట్ లైన్ లో ఉన్న వారికి, అంటే నర్సులకు డాక్టర్లకు అలాగ ) అలాగే ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉన్న వారికి, 65 సంవత్సరములు పైన బడిన వారికి వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఈ వ్యాక్సిన్ 80/ మంది తప్పక తీసుకోవాలి లేకపోతే ప్రజలలో ఉండి పోయి, కరోనా వ్యాధి నివారణ కష్టం. అంతే కాదు ఇంకా చిన్న పిల్లలకు, యుక్త వాసుల వారి కోసం ఇంకా పరీక్షలు నిర్వహించడం మొదలు పెట్టలేదు. ఇంకా వారి పరిస్థి అలాగే ఉంది. అందుకే ప్రజలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని, అమెరికాలోని డాక్టర్ల తో సహా హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్ తోనే ప్రజలంతా నానా ఇబ్బంది పడుతుంటే కరోనా కొత్తరకం స్ట్రెయిన్ బెడద మొదలయ్యింది. ఇది అంత ప్రాణాంతకం కాకపోయినప్పటికీ, త్వరగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే లక్షణం ఎక్కువ అని అంటున్నారు. ఈ "కరోనా స్ట్రయిన్" ఇండియాకి పాకిందనుకుంటే అమెరికాలో కూడా మొదలయ్యింది. ఇది ఎంతవరకో, ఎక్కడివరకూ వెడుతుందో అర్ధం కాని పరిస్థితి. ఈ 'కరోనా వైరస్ స్ట్రెయిన్' వైరస్ వ్యాప్తి తొందరగా వ్యాపించడంతో, ఇంకా కరోనా నుండి పూర్తిగా బయట పడక పోయినా, ఫైజర్ కంపెనీలు తయారుచేస్తున్న టీకాల వలన ప్రయోజనం పొంది,కరోనా నుండి బయట పడతామని ఆశపడుతున్న ప్రజలలో ఎంత ప్రాణాంతకం కాదనుకున్నా, ప్రజలలో భయం పుట్టుకొస్తోంది. ఇప్పుడు వచ్చిన ఫైజర్ టీకాలు కూడా కొత్త వైరస్ తగ్గించేందుకు ఉపయోగపడుతుందని అంటున్నారు. ఏది ఏమైనా ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, కొత్త సంవత్సరం వేడుకలకు, పెళ్లి వేడుకలకు, మీటింగులకు , షూటింగులకు అన్నిటిలోను తగు జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు వ్యక్తికీ వ్యక్తికీ మధ్య దూరాన్ని పాటిస్తూ, మాస్కు లు వాడుతూ, సేనిటైజర్ లు వాడుతూ, ప్రజలంతా మాములు స్థితికి వచ్చేవరకు, తగు జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే సంక్రాతి సంబరాలలో కూడా ప్రజలంతా తగిన జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఉంది. రథ యాత్రలు, కోడి పందాలు, సంక్రాంతి పండుగల ప్రయాణాలంటూ ప్రజలు జాగ్రత్తలు గాలికి వదిలేస్తే ఇబ్బందుల పాలవుతారనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రపంచంలోని ప్రస్తుత పరిస్థితులు ప్రజలంతా దృష్టిలో పెట్టుకుని, తమ తమ అహంకారాలను వీడి అరాచకాలకు అన్యాయాలకు పాల్పడకుండా, దౌర్జన్యాలను వీడి కొత్త సంవత్సరానికి అందరూ ఆనందంగా స్వాగతం పలుకుతూ ప్రతీ ఒక్కరూ 2020 లో పడిన, కష్టాలను మరచిపోయి సుఖ శాంతులతో ఉండాలని కోరుకుంటోంది మీ చైతన్యం సంకల్పబలం.

తీగవరపు శాంతి

# అభిప్రాయవేదిక

చైతన్యం పత్రిక రచయితలకు రచయిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

1. చైతన్యం పత్రికను టైటిల్ పేజీతో సహా ఎంతో అత్యద్భుతంగా తీసుకు వస్తున్నారు. సామాజిక ప్రజలను దృష్టిలో ఉంచుకుని, పత్రికలోని ప్రతీ పేజీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకొస్తున్న పత్రిక లాగ అనిపిస్తోంది. ఎప్పటికప్పుడు అప్ డేట్స్ ను తీసుకొస్తూ అత్యద్భుతంగా తీసుకొస్తున్న ఈ పత్రిక నూతన సంవత్సరంలో ఇంకా ముందుకు దూసుకు పోవాలని కోరుకుంటూ ...

సాయి ప్రసాద్, రమాకాంత్ , శ్రీమతి సత్య కొవ్వూరు. శ్రీమతి శ్రీ లక్ష్మి, శ్రీమతి అపర్ణ , శ్రీ రంగా రావు ---- కర్నూలు.

2. "ఎలక్ట్రాన్ గారు" వ్రాసిన 'ఓ రచయిత కథ' చాలా బావుంది. ఆయన వ్రాసే ప్రతీ నెల కథ బావుంటోంది. "పూరి జగన్నాథుని కథ' ముక్తి ని పొందడం, స్వామిని అర్చించమని చెప్పడం చాలా బావుంది.

శ్రీ జగన్నాథం , శ్రీమతి శ్రీలత, శ్రీ అన్నారావు --- పేరూరు. శ్రీ మతి మహాలక్ష్మి , శ్రీమతి కనకారావు , శ్రీమతి సుధ --- కరీంనగర్ .

3. 'వేదుల సుబ్రహ్మణ్యం గారు' మాతృభాషకు ప్రాధాన్యతను ఇస్తూ ఎంతో అద్భుతంగా వ్రాస్తున్నారు పద్యాలు. మోక్ష నగరాలలో రెండవది అయిన మాయ (నేటి హరిద్వార్ ) గురించి ఎంతో బాగా వ్రాసారు.

శ్రీమతి తేజ, శ్రీమతి కల్పన, శ్రీ కృష్ణ -- బొంబాయి, శ్రీ మధు, శ్రీమతి జ్యోత్స్న , శ్రీ సుబ్రహ్మణ్యం --- కాకినాడ

4. నండూరి సరోజాదేవి గారు సినీమా లోకంలోకి తీసుకు వెడుతూ, సింగర్స్ ని పరిచయం చేయడం చాలా బావుంటోంది. 'పాలేపు బుచ్చిరాజు గారు అందిస్తున్న సుందరకాండ చూస్తుంటేనే ఒక భక్తి భావం ఏర్పడుతోంది. ఎంతో వివరంగా చక్కగా అందిస్తున్నారు.

శ్రీ కరుణాకర రావు, శ్రీ విశ్వనాథం , శ్రీ కామేష్ --- చెన్నై , శ్రీ మహేష్ , శ్రీమతి విమల , శ్రీ సత్యన్నారాయణ - వేములవాడ.

5. పుట్టుకకు చండాలుడు కాదు, కర్మకు చండాలుడు అంటూ కర్మ చండాలుని దోషములకు నివృత్తి లేదు అంటూ "వెంకటాచార్యులు గారు" ఎంతో గొప్పగా వ్రాసారు. 'గ్రీసు దేశపు పురాణ గాథలు" లో ఒలింపియనులు గురించి చాలా బాగా వ్రాశారు.

శ్రీమతి లక్ష్మి, శ్రీమతి సరోజిని, శ్రీ నరసింహమూర్తి --- ఏలూరు. శ్రీ ప్రసాద్, శ్రీ మురళీ కృష్ణ , శ్రీమతి అనంత --- రాజమండ్రి.

6. ' ప్రేమగా కొనసాగుతున్న "ప్రేమంటే ఇంతే" లో ప్రేమతో చెడువాగ్దానాలకు స్వస్తి చెప్పడం కూడా తీసుకు వచ్చారు. "పాలకుర్తి రామమూర్తి గారు ' "భయం" కథ అనుమానమే భయం అంటూ బాగా వివరించారు.

శ్రీ సురేష్ కుమార్ , శ్రీ మధు సూదన్, శ్రీమతి శ్రేయ --- విజయనగరం. శ్రీ మధు, శ్రీమతి విస్వేస్వర రావు, శ్రీమతి లత --- రావులపాలెం.

7. "శ్రీమతి ఆదూరి హైమవతి గారు" వ్రాసిన "నవ విధ భక్తులు" గురించిన కథ చాలా బావుంది. "మావూరి నందుల కథ" లో టైం చెప్పడం వాచీ పెట్టుకోవడం బావుంది.

శ్రీమతి అన్నపూర్ణ, శ్రీమతి పవిత్ర, శ్రీ కోటేశ్వరరావు --- రాయపూర్. శ్రీ చిట్టిబాబు, శ్రీమతి శ్యామల ---హైదరాబాదు.

8. సైన్స్ గురించి ఆలోచింప చేస్తూ 'శ్రీమతి చాగంటి కృష్ణ కృష్ణ కుమారి గారు" ఇస్తున్న పజిల్ ఆలోచింపచేసేదిగా బావుంటోంది .

"కవిదేవ రాజు రచయిత మహారాజు " అంటూ గొప్ప పరిశోధకుని పరిచయం చేశారు. వారి గురించి ఎంతో ఆసక్తిగా చదివి తెలుసుకున్నాం.

శ్రీ శ్రీనివాస్ , శ్రీమతి ప్రమీల , శ్రీ దుర్గా ప్రసాద్ ---- చాగల్లు. శ్రీ రాధాకృష్ణ, శ్రీమతి కమల, శ్రీమతి సుశీల- రామవరప్పాడు.

# వైద్యో నారాయణో హరి:

"చైతన్యం సంకల్పబలం" పత్రిక మన పాఠకుల కోసం ప్రత్యేక శీర్షికను మీ ముందుకు తీసుకు వస్తోంది. ఈ శీర్షికను వీడియో ద్వారా అమెరికాలోని అత్యంత ప్రముఖ డాక్టర్లను ప్రజలకున్న ఆరోగ్య సమస్యలను ముఖా ముఖి వీడియో ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రశ్నలను అడిగి ఇంటర్వ్యూ చేసి, ప్రజల ఆరోగ్య సమస్యల నివారణకై అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఎంతో గొప్ప ఉద్దేశ్యంతో మన ముందుకు వచ్చారు "డాక్టర్ స్రవంతి". డాక్టర్ స్రవంతి AFMC లో MBBS చేసి, తరువాత లండన్ లోని "గైస్" హాస్పిటల్ లో ట్రైనింగ్ అయిన తరువాత అమెరికాలో ఆంకాలజీ, హిమటాలజీలలో ఫెలో షిప్ చేసి బెయిలర్ కాలేజీ ఆఫ్ మెడిసిన్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు.

ఈ సందర్భంగా చైతన్యం పత్రిక అమెరికా, టెక్సాస్ హ్యూస్టన్ లోని ప్రఖ్యాత బేయర్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ లో Professor and Chief of Pulmonary /Critical Care గా పనిచేస్తున్న డాక్టర్ కల్పలత గుంటుపల్లి గారితో ముచ్చటించింది.



డా. కల్పలత గారు హైదరాబాదు లోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ లో మెడిసిన్ పూర్తి చేసుకుని, అమెరికాలోని District of Columbia GH లో రెసిడెన్సీ చేసి, ఆ తరువాత Georgetown University మరియు Pittsburgh లో Super Specialization చేశారు.

డా. కల్పలత గుంటుపల్లి గారు సాధించిన విజయాలు చెప్పాలంటే లెక్కలేనన్ని. కొన్నింటిని గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

ఎండోడ్ ప్రొఫెసర్ షిప్ అనేది ఒక విశ్వవిద్యాలయం తమ ఆధ్యాపకులకు ఇచ్చే అత్యున్నతమైన గౌరవం. ఇది యూనివర్సిటీ జీవితకాలం అంతా నిలిచివుంటుంది. ఆ గౌరవం పొందిన వ్యక్తి డా. కల్పలత గుంటుపల్లి మన తెలుగు రాష్ట్రాలకు చెందినవారై ఉండటం మనకెంతో గర్వకారణం. హైదరాబాద్ లోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ లో గ్రాడ్యుయేషన్ చేసిన ఈవిడ అమెరికాకి వలస వెళ్లి, అక్కడ ఇంటర్నల్ మెడిసిన్, పల్మనరీ డిసీజెస్ అండ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ లో స్పెషలైజ్ చేశారు. పిట్స్ బర్గ్ మరియు ఎమరీ విశ్వవిద్యాలయాల అధ్యాపక విభాగంలో పనిచేశారు. యాభై వేలకి పైగా ఉన్న భారతీయ సంతతి వైద్య అమెరికన్ అసోసియేషన్ కి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. అలాగే ఇరవైవేలకి పైగా సభ్యులున్న అమెరికన్ ఛెస్ట్ ఫిజిషియన్స్ సమాఖ్యకి అధ్యక్షురాలిగా పనిచేశారు. క్రిటికల్ కేర్ బోర్డ్ ఆఫ్ అమెరికన్ బోర్డ్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ లో 6 సంవత్సరాలు సభ్యురాలిగా విధులు నిర్వర్తించారు. యాక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్

సిండ్రోమ్ మరియు వైద్య విద్య మీద పరిశోధనలు జరిపి ఎన్నో గ్రాంట్లు (సహాయక నిధులు) అందుకుని-యున్నారు. 150 కి పైగా శాస్త్రీయ ప్రచురణలు (సైన్టిఫిక్ పబ్లికేషన్స్) ఈవిడ జరిపారు. హైదరాబాదులో ఒక వైద్య కళాశాల మరియు స్కూల్ ఆఫ్ రెస్పిరేటరీ థెరపీ నెలకొల్ప-టంలో తమ సహాయ సహకారా-లు అందించారు. సంవత్సరానికి రెండు, మూడు సార్లు స్వచ్ఛందంగా భారతదేశంలోని హైదరాబాదు, పు-ట్టపర్తి మరియు బెంగుళూరులలో బోధన మరియు రోగులకు చికిత్స చేస్తారు. వైద్యుల మరియు రోగుల శిక్షణకు, అలాగే ఐ. సి. యు చికి-త్సలపై ఏడు భారతీయ భాషల్లో కోర్స్ మెటీరియల్ తయారుచేశారు.

అమెరికాలో కోవిడ్ కేసులు వి-జృంభించిన సమయంలో డా. కల్పలత గారు కోవిడ్ పై సమరానికి నాయకత్వం వహించి ప్రణాళికలు రూపొందించారు. 'కోవిడ్ హీరో గోల్డ్ పిన్' చే సత్కరింపబడ్డారు. డా.క-ల్పలత గారు చేసిన గణనీయమైన సేవలకు, నాయకత్వపు విలువలకు గాను ఆవిడను ACCP Hall of COVID Heroes లో స్థానం ఏర్ప-రచారు.

ఆవిడను ఎన్నో అవార్డులు అలం-కరించాయి. మచ్చుకు కొన్ని:.



'Pravasi Bharatiya Samman' award the highest civilian award given to non resident Indian, - by the President of India (2012)

'Master FCCP' from ACCP, 'Master Clinician life time achievement award' by the Baylor College of Medicine (2013),

Oscar Friedman endowed professorship (2013) .Distinguished scholar in Critical Care Medicine' by the Chest Foundation (2006), "College Medalist" award by the American College of Chest Physicians (2012)

'World lung health award' by the American Thoracic Society(2004)

'Lifetime achievement award' by the Indian Society of Critical Care Medicine, (2010)

"Parker Palmer - Courage to teach" award by the Accreditation Council for graduate medical education (2008)

Presidential award for 'academic excellence' by the Baylor College of Medicine (2004)

and 'MACP" by the American College of Physicians' (2008) to name a few.

"Washington Post". "House Calls", "India Today" "Femina" "Zarposh" పత్రికలలో ఆమె గురించి ఎన్నో వ్యాసాలు ముద్రిత-మయ్యాయి.

మన పాఠకులతో డా. కల్పలత గారు పంచుకున్న వివరాలను పైన ఉన్న వీడియో లింక్ ద్వారా తెలుసు-కోవచ్చు.

# ఇదీ ఓ సమస్యే



## ఎలెక్ట్రాన్

ఎండ ఓమోస్తరు తీవ్రతతోనూ, వాతావరణం అతి ఉక్కగానూ ఉంది. సముద్రతీరం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నా, భర్తమీది కినుకతో మౌనం వహించిన ఆలిలా పిసరంత గాలి కూడా వెయ్యటల్లేదు. వేళ్లకి నీళ్లందక ఎండుబారిపోయి, గోధుమ వర్ణంలోకి మారిపోతూన్న ఆకులతో స్తంభించిపోయిన దారిపక్క వృక్షాలు చలనరహితమైన త్రిదిశ వర్ణచిత్రాల్లా కనబడ్తున్నాయి. సూర్యుడూ, భూమీ, నీరూ, ఆకాశమూ జనావళిమీది ఆగ్రహంతో ఒక్కసారి కలిసికట్టుగా తమ కసిని చూపిస్తున్నట్టుగా ఉంది. భద్రిరాజు మనసు అవమానంతో ఉడికిపోతుండగా, తన చుట్టూ ఉన్న ప్రపంచం మంటలతో భస్మమైపోతోందన్న ఆక్రోశంతో మంథనా కాలేజీ నుంచి సైకిలు మీద ఇంటికి తిరిగివచ్చేశాడు.

"ఏం మధ్యాహ్నమే తిరిగి వచ్చేశావు? కాలేజీలో చేరి నాలుగు రోజులు కూడా కాలేదు. ఇలా క్లాసులు ఎగ్గొడితే ఇంటరెలా గట్టెక్కు తావు, డాక్టరెలా అవుతావు?" తండ్రి సోమరాజు కాస్త పోపులో పేలుతున్న ఆవగింజల్లా చిటపటలాడుతూ అడిగాడు.

"మార్చిలో పరీక్షలైయ్యాయి. ఇంకా ఫలితాలు రాలేదు. నా రికార్డు చూసి మంథనా మహాశయులు ముందస్తుగానే అడ్మిషన్ ఇచ్చేసినప్పుడు చంకలు గుద్దుకొన్నావు. ఇంకా మెదడు చల్లారకుండానే అప్పుడే క్లాసులు మొదలు పెట్టేశారు. మొన్న చెప్పిన పాఠాలకి నిన్న ఉదయం మొదటి గంటలో పరీక్ష పెట్టేశారు. ఇలాంటి ఒత్తిడికి నేను తట్టుకోలేను. నేను ఈ కాలేజీకి వెళ్ళను. నన్ను ప్రభుత్వ కాలేజీలో చేర్పించు. నేను ఏ కాలేజీలో చదివినా నాకు రావాల్సిన మార్కులూ, ర్యాంకులూ నాకొస్తాయి!"

"కుదరదు. లక్షరూపాయలు ముందుగానే తీసేసుకొన్నారు. నిన్ను కాలేజీ మార్పిస్తే ఆ లక్షా తిరిగి యివ్వరు. కాలేజీ పేరు ప్రతిష్టలు నీకు తెలియనివి కావు. అధిక శాతం ఇంజనీరింగ్, మెడిసన్ సీట్లు దేశీయంగా ఈ కాలేజీకే లభిస్తున్నాయి. నేను నీ భవిష్యత్ కోసం ఇంతశ్రమ పడుతోంటే నీకు చాలా నిర్లక్ష్యంగా ఉంది. ఒక్క రెండేళ్ళు కళ్ళు మూసుకొంటే చాలు, ఇంటర్ పూర్తయి మెడిసిన్లో సీటు వచ్చేస్తుంది. నాకూ, అమ్మకీ బెంగ తీరిపోతుంది."

"రెండేళ్ళు కళ్లుమూసుకొంటే, కళ్ళు తెరిచి నిద్రా పాడూ లేకుండా చదివేదెలా"

"వెధవ తర్కం చెప్పకు. నేనింక కాలేజీని మార్పించలేను. ఇష్టముంటే చదువు, లేకపోతే చదువు మానేసి అడ్డగాడిదలా ఊరంతా తిరుగు!" సోమరాజు విసురుగా తనగదిలోకి పోయి తలుపు ఢేల్ మని మూశాడు.

వంటగదిలో నిశ్శబ్దంగా పనిచేసుకొంటున్న భ్రమరాంబ ఆ తండ్రీ కొడుకుల వాగ్వాదం వింటోనే ఉంది. భర్త తన గదిలోకి వెళ్లిపోయాడని నిశ్చయించుకొన్న భ్రమరాంబ బయటకి వచ్చి కొడుకుతో, "ఏమిట్రా భద్రీ! నాన్నగారితో అనవసరంగా వాదులాడుతున్నావ్? ఆయన నీ మంచికోసమే కదా చెబ్తోంట!" అని అనునయంగా మాట్లాడబోయింది.

"అమ్మా! మంథనా కాలేజీలో చదవడం నాకిష్టం లేదు. రుబ్బుడు మంత్రం తప్ప బోధనా యంత్రాంగంలో అంత సమర్థతలేదు. నేను అడిగిన రెండు ప్రశ్నలకి సమాధానం చెప్పక దాటవేసి పుస్తకంలోని 42,43 పేజీలు చదవమన్నారు. రెండేళ్ళు కాదుకదా, రెండు రోజులు కూడా ఈ కాలేజీలో చదవ మనస్కరించటల్లేడు. నువ్వైనా నాన్నతో చెప్పు."

"చెప్పడానికి నా వద్ద తగినంత కారణం ఉంటేకదా?"

"అవున్లే కారణం ఉన్నా ధైర్యంగా చెప్పలేని భీరువులు మీరు?"

"ఏమిట్రా, ఏం మాట్లాడుతున్నావ్!"

"అక్క విషయంలో నువ్వు మీ అన్నగార్లకి, నాన్న తన అక్కగారికి ఏం చెప్పగలిగారని? నీపేర్న తాతయ్య పెళ్లి కానుకగా రెండేకరాలు రాయబోతే మావయ్యలిద్దరూ నానా హంగామా చేసి, ఆ ప్రయత్నాన్ని సంతకాలు చెయ్యక అడ్డుకొన్నా-

రు. ఇటు అత్తయ్యకి వివాహం జరిగినప్పుడు నా పితామహుడుం గారు పిత్రార్జితమైన ఆస్తిలో నాలుగెకరాల భూమి రాసిస్తే, నాన్న సంతకాలు చెయ్యడమే కాకుండా, తన వాటాలో రెండు ఎకరాలు అమ్మి,వేలు ఖర్చు పెట్టి అత్తయ్య వివాహం జరిపించాడు. ఇప్పుడు అక్క విషయంలో మేనరికమైనా అయిదేసి లక్షలు కట్నం కావాలంటున్నారు వీళ్ళూ, వాళ్లూ కూడా! ఇటు నా మేనత్తకీ, అటు నా మేనమామలకి సంస్కారమనేది లేదు."

"యివన్నీ ఎవరు చెప్పారు?" భ్రమరాంబ కాస్త విస్తుపోతూ అడిగింది.

"నాకు చిన్న క్లాసుల నుంచి పరీక్షల్లో నూటికి 95 శాతం మార్కులు ఊరికే రాలేదు. నేను పుస్తకాల్నే కాదు, నాయనమ్మ దగ్గర డాబామీద కూర్చుని మన కుటుంబాల చరిత్ర కూడా చదివానన్న సంగతి మీకు తెలియదు."

"ఈ సంగతులన్నీ నీ కెందుకు? ఆడపిల్ల అన్న తర్వాత కొంత రాజీపడకపోతే వివాహాలు జరగవు".

"కావొచ్చు.కానీ నాకు ఏ కాలేజీలోనైనా అడ్మిషన్ సులువుగా వస్తుందని తెలిసికూడా, నాన్న నాకు తెలియకుండా లక్ష రూపాయలు ఆ కాలేజీవాళ్ళకి అర్పించుకోవడం నాకు నచ్చని పని. ఇది నా ఆత్మవిశ్వాసానికి చాలాపెద్ద దెబ్బ. ప్రభుత్వకాలేజీలను మనం విస్మరిస్తే, ప్రైవేటు కళాశాలలు తల్లిదండ్రుల్ని హడలెత్తించి విద్యతో వ్యాపారం చేస్తున్నారు. అమ్మా, నీకు తెలియదేమో కానీ ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న ఎందరో లెక్చరర్లు దొంగచాటుగా ఈ ప్రైవేటు కళాశాలల్లో పాఠాలు చెబ్తున్నారు. అటువంటి కాలేజీల్లో నాకు చదువుకోవడం ఇష్టం లేదు!"

"ఇప్పుడు యిష్టం లేదంటే ఎలారా? నా మెడలోని మూడు పేటల బంగారపు గొలుసు అమ్మేసి ఆ లక్షా కట్టారు. నువ్వు కాలేజీ మార్పించమంటే ఆ లక్షా బూడిదలో పోసిన పన్నీరే కదా?"

"మరి అలాంటిది రేపు నాకు మెడిసిన్లో సీటు వస్తే, ఏడాదికి పదిహేడు లక్షలు ఫీజు! అయిదు సంవత్సరాలు చదివితే ఈ కాలపు స్థాయిలో బోడి ఎం.బి.బి.ఎస్! ఆ సొమ్ములెక్కణ్ణుంచి తీసుకొస్తారట! అటుపైన మరో రెండు డిగ్రీలు సాధిస్తేకాని ఏ పేషెంటూ గడప తొక్కడు."

"పదిహేనెకరాల సాగుబడి ఉంది. నీ చదువుకీ, అక్క పెళ్ళికీ ఢోకాలేదు. సమయానికి వెంటనే చేతిలో సొమ్ములేక నా గొలుసు తీసుకొన్నారే తప్ప, నాకున్న బంగారానికీ లోటు లేదు. అందుచేత డబ్బు చింతతో ఈ కాలేజీలో చదువు మానకు!"

"సరే! ఈ సాయంత్రం నాన్న ఏదో పని మీద హైదరాబాద్ వెడ్తున్నాడు కదా? ఆయన అటు కదలగానే నాతో ఒకసారి కాలేజీకి రా!

ఆ సాయంత్రం యిద్దరూ మంథనా కాలేజీ ప్రాంగణంలో అడుగు పెట్టి, సైన్స్ బ్లాక్ వైపు నడిచారు. సరిగా అదే సమయానికి ఓ తరగతి గదిలోంచి విద్యార్థులు బయటకి రాసాగారు. వారిలో ఒకడు,"ఒరేయ్ శ్రీనుగా! మధ్యాహ్నం క్లాసులెగ్గొట్టిన మన భద్రిరాజు బామ్మర్ది వచ్చాడ్రోయ్! కూడా మన అత్తమ్మని కూడా తీసుకు వచ్చినట్లుంది!"

ఓ పదిమంది గొల్లున నవ్వారు. విద్యార్థుల వెనక ఆఖరుగా నందబాల ఒక పుస్తకం పట్టుకొని వచ్చింది.

"ఏమిటమ్మా, ఇలా తమ్ముడితో కలిసి వచ్చావు? మధ్యాహ్నం తమ్ముడు క్లాసుకి డుమ్మాకొడితే ఎందుకో అనుకొన్నాను! సంగతేమిటి?" అంది నందబాల

భద్రిరాజు మౌనంగా క్లాసులోకి దారి తీశాడు. తల్లి, కూతుళ్ళు భద్రిరాజుని వెన్నంటి ఆ తరగతి గదిలో ప్రవేశించారు. బయట నున్న విద్యార్థులో కాస్సేపు వరండాలో ఆగి వెళ్ళిపోయారు.

"విన్నావా అమ్మా! ఆ వెధవల కారు కూతలు? అక్క ఈ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేస్తూండడం కాదు కానీ, రెండు రోజుల్లో కాలేజీ వారందరికీ బామ్మరిదినైపోయాను! ఏ కాలేజీలో జేరినా అక్కమీద సహోద్యోగులనుంచి విద్యార్థుల వరకూ ఏవో రకమైన వ్యాఖ్యలు తప్పవు. అక్క అందం అటువంటిది మరి?నాన్న నన్ను రెండేళ్ళు కళ్లు మూసుకొని ఈ కాలేజీ చదువు ముగించమంటున్నాడు. రెండేళ్ళు ఈ బామ్మరిది పిలుపులనెలా సహించగలను? సరదాగా తీసుకోండామన్నా, నా దగ్గర చాలా అసభ్యంగా కూడా మాట్లాడుతున్నారు! తను ఈ ఉద్యోగం మానేయకూడదు. చెయ్యాలి. అయితే నేను మట్టుకు ఈ కాలేజీలో చదవడం ఇష్టం లేక, కాలేజీ మారడం కోసం గొడవపెడ్తున్నాను. ప్రత్యక్షంగా చూసావు కాబట్టి నాన్నకి చెప్పు!"

నందబాలా,భ్రమరాంబా నోట మాట రాక మౌనం దాల్చారు! అందమైన అక్కలు పనిజేస్తున్న కాలేజీలో తమ్ముళ్ళు చదువుకోకూడదు. సంగతి తెలిసి సోమరాజు ఏ నిర్ణయం తీసుకొంటాడో?

# వేదులాన్వయు పలుకు -2

వేదుల సుబ్రహ్మణ్యం



కొవ్వుబరువును తగ్గింప గోరి యొకడు
వైద్యునిన్ జేరి దీనుడై వగవ సాగ
నెన్నియో పరీక్షలు చేసి యెంచి జూసి
నడక యొక్కటె మందని నచ్చ చెప్పె
ఇంటి దగ్గర 'పార్కు' న కేగి యతడు
నిత్యమును జేయు వ్యాయామ నియమములను
శ్రద్ధ తప్పక పాటింప శపథ మొందె

సహజ చపలత్వ మించుక సంతరింప
జంతికల మూట నిత్యము జంక బెట్టి
'పార్కు' లో నొక మూలను పవ్వళించి
మూట విప్పి సమూలము నోటగుక్క
నొక్క పక్షము నావల పిక్క బలిసి
బరువు పెంచెను మరియొక పది 'కిలో'లు
కొవ్వు రెట్టింపునయి బెట్టె కెవ్వు కేక
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

తెలుగు భాషను మాటాడ దెలియజేసి
ఒత్తులను పల్కు నీమము లొత్తిజెప్పి
స్పష్టముగ పల్కునట్టుల సాయపడుము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

ఉచిత సలహాల నిచ్చిన నొప్పుకాదు
కోరి యడుగగ నిచ్చుట కొంత మేలు
ఇచ్చినవి ఆచరించుట నింక మేలు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

వారకాంతల కౌగిళ్ళ వలల జిక్కి
దార సుతులను విడనాడి దూరముండు
వారలకు లేదు నిష్కృతి పాప మడగ
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

తండ్రి తనయుని ప్రేమించ తప్పుకాదు
కాని వ్యామోహ మంటిన గలుగు ముప్పు
భారతము నేర్పు పాఠము పరిగణించు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

దేహములు వేరెయైనను దేహమందు
నున్న ఆత్మయె పరమాత్మ యన్న నిజము
తెలిసికొనగల జ్ఞానమ్ము కలుగు నొక్కొ!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

ఆడ మగయను భేదము నరయకుండ
సంతతిని నెల్ల భగవత్ప్రసాద మనుచు
ప్రీతి నందించు సంస్కృతి పెరగ నిమ్ము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

కాలమెప్పుడు నిర్ణీత గతుల దొరలు
మార్పు గమనించి ప్రజల సమ్మతము నొంది
ప్రగతిపథమును తీర్పుము తగినరీతి
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

కోరుకొన్నది దొరకని కారణమున
క్లేశ పడకుము హృదిని నిరాశ తోడ
మించి కృషిసల్పి దాని దక్కించు కొనుము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

కొడుకు కోడళ్ళు తగవుల బడుట జూచి
తగుదునని మధ్య తలదూర్చ దగదు సుమ్మి!
మిన్నకుండిన నొప్పయి మేలు కలుగు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు

# పూరి జగన్నాథ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.
స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్మ్యాన్ని యథామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

23 వ అధ్యాయం

జైమిని ఋషి సంవాదం

(ఇంద్రద్యుమ్నుడు బ్రహ్మను దర్శించుట)

ద్వారపాలకా! ఇతడు రాజర్షి అగు ఇంద్రద్యుమ్నుడు. బ్రహ్మను చూడడానికి వచ్చాడు. నీవు అనుమతిస్తే లోపలికి తీసుకు వెడతాను." అని నారదదుడు అడిగాడు. " మహర్షి మీరు మా పై కోపగించకండి. మీతండ్రి అయిన బ్రహ్మగారు సభలో ఉన్నారు. సంగీత సభ జరుగుతోంది. మీరు లోపలికి వెళ్లిఅనుమతితీసుకోండి. అంతవరకు దిక్పాలకులతోకలిసి ఇక్కడ ఉంటారు." అని ద్వారపాలకుడైన మణికోదరుడు వినయంగా విన్నవించాడు. నారదుడు లోపలకి వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేసి, ఇంద్రద్యుమ్నుడుగూర్చి తండ్రికి చెప్పాడు.బ్రహ్మసంగీత మాధుర్యంలో నిమగ్నమై ఉండి ఏమి మాట్లాడ లేదు. రాజు బయట ఉండిపోయాడు.

( 1- 8 )

చివరకు ఇంద్రాదులతోబాటు రాజును లోపలికి ప్రవేశ పెట్టారు. ఇంద్రద్యుమ్నుడు బ్రహ్మను చూసి, సాక్షాత్ విష్ణువును చూసినట్లుగా భావించాడు.స్తుతిస్తూ నమస్కరిస్తూ బ్రహ్మకు కొద్ది దూరంలో నిలబడ్డాడు. కాలంగడిచిపోతోంది. సభ పూర్తిఅయ్యేవరకు ఎవరు మాట్లాడలేదు.

సభపూర్తి అయిన తరువాత బ్రహ్మ రాజును చూసి చిరునవ్వు నవ్వి " రాజా! నీవు భగవంతునికి ఇష్టుడయిన



వాడివి.సత్యలోకాన్ని చూడగలుగలిగావు. నన్ను చూసినతరువాతనీకు తీరని కోరిక ఏదిఉండదు.అయినా నీ కోరిక ఏమిటో సంకోచం లేకుండా చెప్పు" అని బ్రహ్మ రాజుని అడిగాడు.

" నీవు సర్వాంతర్యామివి. నీకు తెలియని విషయం లేదు. అయినా నాపై ఉన్న ప్రేమతో అడుగుతున్నావు. నీవు అజ్ఞాపించినట్లుగా,నారదునిఆధ్వర్యంలోఅశ్వమేధ యాగాలు పూర్తిచేసాను. స్వామి దారుమయ రూపాన్ని చూసాను. స్వామికోసం నిర్మించిన భవనంలోవిగ్రహ ప్రతిష్ఠకు నీవు రావాలని నా ప్రార్ధన" అని రాజు విన్నవించాడు..

"ఇంతలో దుర్వాస మహర్షి లోపలికి ప్రవేశించి, "స్వామి! నీ ద్వారపాలకులు లోపలికి అనిమతించకపోవడం వలన మేమందరం బయట ఉండి పోయాం. వారందరిని లోపలికి అనుమతించు" అని ప్రార్ధించాడు. "మహర్షి! ఇంద్రద్యుమ్నుడు పాపాలను నశింపచేసుకొని, జీవన్ముక్తుడయి ఇక్కడకు వచ్చాడు.

ఇతనితో ఇతరులు సమానులు కారు. విష్ణువును మనస్సులో నిలుపుకున్నాడు. నా అనుగ్రహం వలన నన్ను అర్చించడానికి ఇక్కడకు వచ్చాడు. దేవతలు కూడా తపస్సు చేసి ఇక్కడకువస్తారు. అయినానీకోరిక ప్రకారం మిగిలిన వారిని లోనికిప్రవేశ పెట్టు" అని బ్రహ్మ పలుకగా దేవతలు లోపలికి వచ్చారు.

దేవతలు లోపలికి వచ్చి బ్రహ్మకునమస్కరించి ఇంద్రద్యుమ్నుని చూసి,"రాజా! నీవు స్వామికోసం భవనం నిర్మించావు. కాని నీవు ఇక్కడికి వచ్చి ఒక మన్వంతరంగడిచిపోయింది. నీ బంధువులు ఎవరు అక్కడ లేరు. నీవునిర్మించినభవనాలలోరెండుమాత్రమే మిగిలాయి. నీవు వెంటనే వెళ్లి భవనాలు స్వాధీనం చేసుకో. తరువాత మేము వస్తాము" అని దేవతలు చెప్పారు. **( 9 - 20)**

దేవతలు తలలు వంచుకొని స్వామి పాదాలు చూస్తూ ఉన్నారు. "దేవతలారా! మీరందరు కలసి ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని బ్రహ్మ అడిగాడు.

"స్వామి! పూర్వం మేము ఆరాధించిన నీలరూపుడయిన స్వామి అంతర్ధానమయ్యాడు. ఇంద్రద్యుమ్నుడు యాగాలు చేసిన తరువాత స్వామి ఆవిర్భవించుటకు కారణం ఏమిటో మిమ్ము అడిగి తెలుసుకుందామని వచ్చాము" అని దేవతలు విన్నవించుకొన్నారు? "ఇది రహస్యం ఇంతవరకు ఎవరికి చెప్పలేదు,మీరు అడిగారు కనుక చెబుతున్నాను.పూర్వం స్వామి నీలమణి రూపంలో ఉన్నాడు. ఆ సమయంలో నా జీవితంలో

ద్వితీయార్ధం ప్రారంభమయింది. శ్వేతవరాహకల్పం, స్వాయంభువ మన్వంతరం గడిచింది. నా ద్వితీయార్ధం మొదటిరోజున స్వామి దారు రూపాన్ని పొంది, పురుషోత్తమక్షేత్రంలో స్వామి ఆవిర్భవించాడు. ఆస్వామి దారుమయ రూపంలో ఉండి నా ఆయుః ప్రమాణాన్ని లెక్కిస్తూ ఉంటాడు. మా ఇరువురికి భేదం లేదు. మేము సర్వత్ర వ్యాపించి ఉన్నాం. పురుషోత్తముడు పాల సముద్రంలోను, శ్వేత ద్వీపంలోను యోగనిద్రలో ఉంటాడు. ఆ స్వామి చైతన్య స్వరూపమే వృక్షం. ఆయన శరీరంపై ఉన్న రోమాలు కల్పవృక్షాలు. వాటిపై శంఖ, చక్రాలు చిహ్నంగా ఉంటాయి. అటువంటి ఒక రోమం సముద్రంలో పడింది. ఆ వృక్షం దారుమయ రూపాన్ని పొంది లోకంలో భోగాలు అనుభవిస్తోంది.వేలాది జన్మలలో నేను స్వామిని ఆరాధించాను.

ధ్యానము, ధారణ చేయలేని వారికి మోక్షాన్ని ఇవ్వడానికి స్వామి భూలోకంలో ఆవిర్భవించాడు. ఈ క్షేత్రం స్వామి శరీరం. ఎవరు ఎలాభావిస్తే స్వామి వారికి అలా కనిపిస్తాడు. స్వామిని దర్శించుకున్న వారి మనస్సు నిర్మలమయి మోక్షాన్ని పొందడానికి అర్హత కలుగుతుంది. ( 21 - 74 )

" దేవత్వాన్ని విడిచిపెట్టి భూలోకానికి వెళ్లి. నియమంగాస్వామినిఆరాధించాలని"దేవతలుమనస్సులో అనుకొన్నారు. " దేవతలారా! ఇంద్రద్యుమ్నుని అనుగ్రహించడానికి స్వామి అక్కడ ఆవిర్భవించాడు' అక్కడ ఉన్న ప్రతిమ మాట్లాడుతుంది. వరాలనిస్తుంది. స్వామిని ప్రతిష్ఠించడానికి నేను అక్కడికి వస్తాను. మీరు కూడా రండి. రాజు ముందుగా వెళ్లి ఏర్పాట్లు చేస్తాడు. మీరు రాజుకి సహాయపడండి" అని బ్రహ్మ ఆదేశించాడు. పద్మనిధిని తోడుగా ఇచ్చి పంపిస్తాను" అని బ్రహ్మచెప్పగానేఇంద్రద్యుమ్నుడుఆనందించి,నమస్కరించి, దేవతలతో కలిసి భూలోకానికి తిరిగి ప్రయాణ మయ్యాడు. ( 75 - 80)

స్కాందపురాణంలోని వైష్ణవ ఖండంలో పురు షోత్తమ క్షేత్ర వైభవములో జైమిని ఋషి సంవాదము అను ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం.

## 24 వ అధ్యాయం

### జైమిని ఋషి సంవాదం.

### ( ఇంద్ర ద్యుమ్నుడు భూమికి తిరిగి వచ్చుట)

ఇంద్రద్యుమ్నుడు ఇంద్రాది దేవతలతోకలిసి భూలోకానికి వచ్చాడు. జగన్నాధుని దర్శించుకొని, నమస్కరించి ఈవిధంగా స్తుతించాడు.

ఇంద్రద్యుమ్నుడు జగన్నాదుని స్తుతించుట-------

నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణ హితాయచ

ప్రణతార్తి వినాశాయ చతుర్వర్గైక హేతవే

హిరణ్యగర్భ పురుష ప్రధాన వ్యక్త రూపిణే

ఓం నమో వాసుదేవాయ శుద్ధ జ్ఞాన స్వరూపిణే

పరబ్రహ్మ స్వరూపుడు, బ్రాహ్మణులకు గోవులకు హితాన్ని చేయువాడు, దుఃఖాలను పోగొట్టేవాడు, ధర్మాది నాలుగు పురుషార్థాలను ఇచ్చేవాడు, హిరణ్యగర్భుని, పురుషుని, ప్రకృతిని వెల్లడి చేసేవాడు, శుద్ధజ్ఞాన స్వరూపుడా, నీకు నమస్కారము" అని రాజు స్తుతిం చాడు. (1- 4 )

ఇంద్రద్యుమ్నుని కళ్ళనుండి ఆనంద భాష్పాలు రాలాయి. జగన్నాధునికి ప్రదక్షణ చేసాడు. దేవతలు స్వామిని దర్శించుకొని ఈ విధంగా స్తుతించారు.

దేవతలు జగన్నాధుని స్తుతించుట----------

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్

స భూమిం సర్వతోవ్యాప్య అధ్యతిష్ఠ దశాంగులం

యః పుమాన్పరమం బ్రహ్మ పరమాత్మేతి గీయతే

భూతం భవ్యం భవిష్యంచ సర్వం పురుష ఏవ తత్

ఏతావానస్యమహిమజ్యాయానేషపుమాన్ప్రభుః

పాదో&స్య విశ్వ  భూతాని త్రిపాదస్యామృతంభువి

ఛందాంసి జిజ్ఞిరే త్వత్తస్త్వత్తో యజ్ఞ పుమానసి

త్వత్తో&శ్వాశ్చవ్యజాయంత గావో మేషాదయస్తథా

బ్రాహ్మణా ముఖతో జాతా బాహూజాః క్షత్రియాస్తవ

విశస్తవోరుజా పద్భ్యాం తథా శూద్రాః సమాగతాః

మనస శ్చంద్రమా జాత  శ్చక్షుస్తే  దివాకరః

కర్ణాభ్యాం శ్వసనః ప్రాణైర్జిహ్వాయా హవ్యవాడపి

నాభితో గగనం ద్యౌశ్చ మూర్ధ్నస్తే సమవర్తత

పాదాభ్యాం తే ధరా జాతా దిశశ్చాష్టా శృతేర్గతాః

సప్తాసన్పరిధయస్త్వత్త ఏకవింశత్సమిచ్చపై

చరాచరాః సర్వభావా స్త్వత్త ఏవహి జజ్ఞిరే

త్వమేవ జగతాం నాథ స్త్వమేవహి పరిపాలకః

ఉగ్రరూపశ్చ సంహర్తా త్వమేవ పరమేశ్వర

త్వమేవ యజ్ఞో యజ్ఞాంశ  స్త్వం యజ్ఞేశ పరాత్పర

శబ్ద బ్రహ్మ పరం త్వం హి శబ్దబ్రహ్మాసి విశ్వరాట్

స్వరాట్ సమ్రాడ్ జగన్నాథ విరాడసి జగత్పతే

అథశ్చోర్ధ్వంచ తిర్యక్త్వం త్వయా వ్యాప్తం జగన్మయ

ప్రాప్నువంతి వరం స్థాన వరాదపి జగత్పతే

అధశ్చోర్ధంచ తిర్యక్త్వం త్వయా వ్యాప్తం జగన్మయ

ప్రాప్నువంతి వరం స్థానం త్వాం యజంతశ్చ యాజ్ఞికాః

భోజ్యం భోక్తా హవిర్హోతా హవనం త్వం ఫలప్రదః

కర్మ ప్రేరయితా త్వం హి ధర్మకార్యార్థ సిద్ధిదః

త్వామృతే ముక్తిదః కో&న్యో హృషికేశ నమో&స్తుతే నమో&స్త్వనంతాయసహస్రమూర్తయేసహస్రపాదాక్షి శిరోరుహభాహవే సహస్రనామ్నేపురుషాయ శాశ్వతేసహస్ర కోటి యుగధారిణే నమః

వయం చ్యుతాధికార స్త్వాం ప్రపన్నాః శరణం ప్రభో

త్రాహి నః పుండరీకాకక్ష అగతీనాం గతిర్భవ

సంసార పతిత స్త్యైకో జంతోస్త్వం శరణం ప్రభో

త్వత్సృష్టా తాదృశో నాస్తి యో దీనపరిపాలకః

దీనా నాథైక శరణం పితా త్వం జగతిః ప్రభో

పాతా పోష్టా త్వమేవేశా సర్వాపద్వినివారకః

త్రాహి విష్ణో జగన్నాథ త్రాహి నః పరమేశ్వర

త్వామృతే కమలాకాంత కః శక్తః పరిరక్షణే

అంతర్యామి నమస్తే&స్తు సర్వతేజో నిధే నమః

వేయి శిరస్సులు, వేయి కన్నులు, వేయి పాదాలు కలవాడా, భూమియందు అంతటావ్యాపించిన వాడా, పరబ్రహ్మము, పరమాత్మా అని కీర్తింపబడు వాడా, భూత భవిష్యత్ వర్తమాన రూపమైన వాడా నీకు నమస్కారము. (ఇంకా వుంది)



# సప్త మోక్ష నగరాలు



## కొొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పరమావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపుఋషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమాదరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైనప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అనుగ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయడానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూతనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్షదాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అందువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

అవి **అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జయిని) మరియు ద్వారక.**

# మాయ (నేటి హరిద్వార్)



**శీతల గంగా తరంగాలు:**

ఈ పుణ్యధామంలో పవిత్ర గంగానది అన్ని కాలాలలో అన్ని వేళల్లో పారుతూ భక్తులను పునీతం చేస్తూ ఉంటుంది. మంచు ఉన్న అతి శీతలమైన నీరు వేగంగా ప్రవహిస్తూ అనేక పురాతన దివ్య క్షేత్రాల మీదుగా పయనిస్తూ భూలోకవాసులను పునీతం చేస్తున్నది. దివి నుంచి భువికి దిగివచ్చిన గంగామాత గురించి కొద్దిగా ముచ్చటించుకుందాం.

ఒక పురాణ కథ ప్రకారం దక్ష యజ్ఞంలో జరిగిన అవమానానికి శివుని భార్య సతీదేవి ఆత్మాహుతి అయింది. శివుడు సతీవియోగం భరించలేకపోయాడు. పరాశక్తి ప్రత్యక్షమై శివుని ఓదార్చుతూ త్వరలో తాను మేనా హిమవంతులకు ప్రథమ సంతానంగా 'గంగ' నామధేయంతో జన్మిస్తానని, తదుపరి వారి ద్వితీయ సంతానంగా గౌరీదేవి నామధేయంతో అవతరిస్తానని, వారు ఉభయులు సదాశివుని సేవలు చేసుకుంటారని చెప్పగా, ఆ వాక్యాలు పరమశివుని సంతోషపరిచాయి.

అన్నట్టుగానే హిమవంత దంపతులకు ప్రథమ సంతానంగా గంగ ఉద్భవించి, తల్లితండ్రుల మమతానురాగాలు పొందుతూ వచ్చింది. ఆమెకు యుక్త వయస్సు వచ్చిన సమయాన, సృష్టి కర్త బ్రహ్మదేవుడు హిమవంతుని కలిసి, పరాశక్తి సదాశివునికి ఇచ్చినమాట గుర్తు చేసాడు. 'గంగ'ను తనకు దత్తత ఇమ్మన్నాడు. అలా ఇస్తే సత్యలోకంలో గంగా- శివులకు కళ్యాణం జరిపిస్తానన్నాడు. బ్రహ్మదేవుని అభ్య-



ర్ధనను మన్నించి, గంగను బ్రహ్మ గారికి దత్తత ఇచ్చాడు. పిదప గంగా శివుల వివాహాన్ని బ్రహ్మ దేవుడు సత్యలోకంలో అత్యంత వైభవంగా జరిపించాడు.

పెళ్లి అనంతరం నూతన దంపతులు అయిన గంగ, శివులు కైలాసానికి వెళ్లబోవు సమయాన గంగను చూసి పుత్రిక దూరమైపోతున్నదని బ్రహ్మదేవు-డు తన దుఃఖము ఆపుకోలేకపో-యాడు. గంగ పెంపుడు తండ్రిని ఓదార్చి, 'తండ్రీ! దుఃఖించకు, నేను నీ కమండలంలో జల-రూపంలో ఉంటాను' అని పలికి భర్తతో కైలాసానికి వెళ్ళిపోయింది. పిమ్మట కొన్ని సంవత్సరాలు గడిచిన పిమ్మట హిమవంత దంపతులకు గౌరీదేవి గా పరాశక్తి అవతరించింది, శివునికి అర్ధాంగి అయింది.

మహా విష్ణువు అనేక అవ-తారాలు ఎత్తుతూ బలి చక్రవర్తిని శిక్షించేందుకు వామనావతారా-న్ని ధరించాడు. బలి చెంత కేగి మూడడుగుల స్థలాన్ని అర్థిం-చాడు. బలి చక్రవర్తి అందుకు అంగీకరించాడు. ఒక అడుగుగా తన పాదాన్ని సత్యలోకం వైపుకు ఉంచాడు. ఒక పాదం భూమిపై ఉంచాడు. ఇక మూడో పాదాన్ని బలి చక్రవర్తి శిరస్సుపై ఉంచి పా-తాళానికి తొక్కివేశాడు. సత్యలోకం చేరిన స్వామి పాదాలను బ్రహ్మ-దేవుడు తన కమండలంలోని గంగతో అభిషేకం గావించాడు. విష్ణుపాదాన్ని వదలలేకపోయిన గంగ విష్ణుపాదంలోనే స్థిరనివా-సం చేసుకుని తరించింది.

అలా విష్ణుపాదంలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్న గంగమ్మ భూమి పైకి రావడం వెనుక మరో కథ దాగి వుంది.

భగీరథుడు ఒక రాజ వంశ-స్థుడు. ఆయన పూర్వీకులు



సగరులు. వారు యజ్ఞాశ్వాన్ని వెతుకుతూ కపిల మహర్షి ఆశ్రమం చేరుకున్నారు. మొదటినుంచి సగరులు యజ్ఞాలు చేసి ఫలితాలు పొందటం ఇంద్రునికి ఇష్టం లేదు. వారి ప్రతీ ప్రయత్నం భగ్నం చేయటం ఇంద్రునికి పరిపాటి అయింది. అందుకే యజ్ఞాశ్వాన్ని కపిల మహాముని ఆశ్రమంలో ఉంచారు. సగరులు యజ్ఞాశ్వాన్ని కపిల ఆశ్రమంలో చూసి కపిల మహర్షితో తగవుకు దిగారు. వారి చేతలకు కోపోద్రిక్తుడై కపిల మహర్షి వారిని భస్మం చేశాడు. ఫలితంగా సగరులకు పుణ్యలోకాలు లభించలేదు. భస్మ రాశులుగా కపిల ఆశ్రమంలోనే ఉండిపోయారు.

తన పూర్వీకుల దుస్థితిని గ్రహించిన భగీరథుడు వారి సద్గతి నిమిత్తం విష్ణు భగవానుని వేడుకుంటూ ఘోర తపస్సు చేశాడు. వాసుదేవుడు భగీరథుని తపస్సుకి మెచ్చి ప్రత్యక్షమైనాడు. ఆయన ఆదేశం ప్రకారం గంగామాతను వేడుకుంటూ మరల తపస్సు చేశాడు. గంగ శివుని ప్రార్థించమన్నది. తాను భూమిపై అవతరించినప్పుడు తన ప్రవాహ వేగాన్ని ఒక్క శివుడే నిరోధించగలడని పలికింది. తదుపరి పట్టు విడవకుండా ఈసారి ముక్కంటిని ప్రసన్నం చేసుకొనుటకు మరల తపస్సు చేశాడు. శివుడు కరుణించాడు. శివాజ్ఞ అనుసరించి గంగ ఆకాశం నుంచి శివుని జటాజూటం పైకి దూకింది. శివుడు గంగను జటాజూటంలో బంధించాడు. గంగాధరుడు తన జటాజూటం లోని గంగను



ఏడు పాయలుగా విడుదల గావించాడు. అందులోని ఒక పాయలోని గంగ మాత్రం భగీరథుని అనుసరించింది. గంగ అలా ప్రవహిస్తూ జహ్ను మహర్షి ఆశ్రమం వైపు జోరుగా ప్రవహించి ఆశ్రమాన్ని ముంచెత్తింది. ఆ దృశ్యాన్ని చూసిన జహ్నుడు కోపించి గంగ యావత్తూ త్రాగివేశాడు. భగీరథుడు మరల దీనంగా వేడుకోగా గంగ తిరిగి జహ్ను మహర్షి నుంచి ప్రవహించింది, తన తప్పుకు జహ్నుడు చింతించి గంగను క్షమించమని వేడుకున్నాడు. జహ్నుని విధేయతను మెచ్చుకుని, ఇకపై తాను జాహ్నవిగా కూడా పిలవబడతానని చెప్పింది.

భగీరథుని వెంట సాగిన గంగ పాతాళానికి చేరి, సగరుల భస్మ రాశులపై ప్రవహించి, వారికి సద్గతులను ప్రసాదింపచేసింది. గంగా నది భాగీరథిగా పిలవబడుతోంది. గంగ పేరు విన్నంతనే మనసులు పవిత్ర భావనలతో పునీతమౌతాయి.


(ఇంకా వుంది)



# 2020

2020 ఎవరూ మరచిపోలేని సంవత్సరం. ప్రపంచాన్ని గడగడ లాడిస్తూ కరోనా మన అందరికీ పరిచయం అయ్యింది. ఎంతోమందికి చేదు అనుభవాలని దుఃఖాలని మిగిల్చింది. కొత్త పంథాలు తొక్కుతూ ముందుకు సాగుతున్న రాకెట్ యుగంలో స్పీడ్ బ్రేకర్ గా మారింది. కరోనా పుణ్యమా అని కొన్ని సంస్థలు, రంగాలు కోట్లకి పడగలెత్తితే, దాదాపు అన్ని వృత్తులు, వ్యాపారాలు కుదేలయిపోయాయి. ఒక్కో నెల ఉగాది మొదలుగా ఒక్కో ఆకారం దాల్చిందీ వైరస్. మొదట భయం, తర్వాత పరిశుభ్రం, ఆశ, నిరాశ, వైరాగ్యం, దురాశ ఇలా రకరకాల మనోభావాలతో కొత్త అలవాట్లు అలవరచుకోవడంలో మనిషి చాలా విధాలుగా తలమునకలయ్యాడు. క్వారంటీన్, సోషల్ డిస్టెన్సింగ్, ఏసింప్టమేటిక్ లాంటి కొత్త పదాలు అందరికీ ఊతపదాలు అయ్యాయి. అన్ని వయసుల వాళ్ళు రకరకాలుగా ఉద్వేగాలకు, ఉద్రేకాలకు గురి అవుతున్నారు. అసలే అనుబంధాలు అంతంత మాత్రంగా ఉంటున్న ఈ కాలంలో ఈ కరోనా దెబ్బ వాటిమీదా పడింది. ఎవరికీ వారే యమునా తీరుగా ఉండటమే మంచిది అనిపిస్తోంది.

ఇంతవరకు అదే కథ; కరోనా చిక్కింది, పల్చబడింది అనే వార్తలు వచ్చాయి. జనాలలో భయం తగ్గింది. కరోనాని ఓడించడానికి చేసిన ప్రయత్నాలు సఫలమై వ్యాక్సిన్ కూడా వచ్చింది. కాలానికి అన్నింటినీ మార్చే శక్తి ఉంది. ఈ సమయం ఉండదు. చక్కని భవిష్యత్తు మన ముందు ఉంది. యుగయుగాలుగా ఏవో ఒక సమస్యలు వస్తూనే ఉన్నాయి. కానీ మానవసంబంధాలు, అనుబంధాలను మనం మరింత పటిష్ఠ పరచుకోవాల్సిన సమయం ఇది. జీవితం చాలా విలువైనది అని బాగా తెలిసివచ్చింది కాబట్టి అలసత్వం వీడి ప్రతి విషయాన్ని శ్రద్ధగా, క్రమ శిక్షణతో ఆనందంగా చక్కని జ్ఞాపకాలను పొందుపరచుకుంటూ, చక్కని జ్ఞాపకాలను మనవారికి అందిస్తూ ఈ కరోనా భారాన్ని ఈ సంవత్సరం డిసెంబరు 31 న భుజాలమీదనుండి దింపేద్దాం. తేలికగా, ఆహ్లాదంగా చక్కని సంకల్పాలతో ధృవీకరణలతో నూతన సంవత్సరం లోకి అడుగు పెడదాం. రెట్టింపు ఉత్సాహంతో పనిచేద్దాం. నూతన సంవత్సరం అందరికీ శుభాలు కలగాలని మనసారా కోరుకుందాం.



# నూటపదహార్లు కందాల్లో సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అద్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

9) నిను జూడగ మాయావిగ
అనుమానము పడును సీత అందుకు హనుమా!
వినుమీ ముద్రిక జూపుము
మును ముందుగ నమ్మునంచు ముద్రిక నిచ్చెన్

9) శ్రీరాముడు కూడా హనుమ శక్తి సామర్థ్యాలని అప్పటికే అంచనా వేయగలిగాడు. ఉత్తమ కార్య సాధకుడి లక్షణాలు ఉన్నవాడు హనుమంతుడు. అందువల్ల ఆతడు తప్పక సీతజాడ తెలుసుకురాగలడని తలపోశాడు. తన చేతి ఉంగరం తీసి, ఇది చూపిస్తే, నిన్ను నా బంటుగా సీత నమ్ముతుంది. అని దానిని అతనికిచ్చాడు.

.

*10)* ముద్రిక చేకొని మారుతి
భద్రముగా దాచిపెట్టి భక్తిగ పలికెన్
రుద్రునివలె నీవుండగ
భద్రమె భటులకు నిరతము భయమే ముండున్

10) హనుమ దానిని జాగ్రత్తగా దాచిపెట్టుకుని, రామునికి భక్తి పూర్వకంగా నమస్కరించి, ఆశీర్వాదం తీసుకుని బయల్దేరుతాడు.

11) అంగదుడాదిగ వీరులు
అంగలు వేయుచు వెడలిరి అంజని వెనుకన్
రుద్రునివలె నీవుండగ
భద్రమె భటులకు నిరతము భయమే ముండున్

11) హనుమంతునితో బాటుగా అంగదుడు జాంబవంతుడు వంటి మహావీరులంతా అత్యుత్సాహంతో జానకీ-మాత జాడ కనిపెట్టడానికి బయల్దేరుతారు.

12) గిరులును శిఖరము లెక్కుచు
తిరుగుచు వింధ్యాద్రి జేరి తేరుకొనంగన్
తరుశాఖల జేరుకొనిరి
పరిచయమాయె నట వృద్ధ పక్షీంద్రునితోన్

12) అలా బయల్దేరినవారు కొండలు ఎక్కుతూ, దిగుతూ వింధ్య పర్వతానికి చేరుకుంటారు. అక్కడ దట్టమైన చెట్లు ఉండడంతో, వాటి కొమ్మల మీద కొంతసేపు అలసట తీర్చుకోడానికి ఆగుతారు. అక్కడే ఒక ముసలి పక్షి కూడా పడి ఉంటుంది.

13) అందురు నను సంపాతిగ
ఎందులకింత కపిసేన ఏకార్యంబో!
విందగు వినగా చెవులకు
సందడిగా చెప్పరాదె సజ్జను లారా!

13) ఆ పక్షి తనని తాను 'సంపాతి' గా పరిచయం చేసుకుని, " ఇంత సందడిగా ఎక్కడికి వెళ్తున్నారు? తెలుసు-కోవాలని కుతూహలంగా ఉంది. మీకభ్యంతరం లేకపోతే చెప్పండి." అని అడిగింది.

14) అనుచు ఖగేంద్రుడడుగగా
వినయముగా రామ కథను వివరించంగా
మనమున ఖేదము నొందుచు
వనచరులతొ పక్షి రాజు వగవకుడనియెన్

14) అప్పుడు వారు అంతవరకు జరిగిన రామ కథనంతా వివరంగా చెప్పి, " మేము సీతాదేవిని వెదకడానికి వెళ్తు-న్నాము" అంటారు.

15) రాక్షసుడొక్కడు దుష్టుడు
దక్షిణ దిక్కుగ నెగురుచు దయనీయముగా
రక్షణ కోరెడి పడతిని
దాక్షిణ్యము లేక వాడు దండించంగా

15) అప్పుడు సంపాతి, "ఒకసారి నేను దుష్టరాక్షసుడొకడు ఆర్తనాదాలు చేస్తున్న స్త్రీని ఆకాశమార్గాన ఎత్తుకుపో-తూ ఉండగా చూశాను. వాడికి అసలు దయాదాక్షిణ్యాలనేవి లేవు."

16) అప్పుడు చూచితి నామెను
ఇప్పుడు తట్టెను నిజంబు ఇల్లాలెవరో
తప్పక సీతయె మరెవరు
తప్పాయె నపుడె వధించ దర్పము పోదే!

16) "ఆనాడే ఆమె సీత అని తెలిసి ఉంటే, వాడిని ఎదిరించి ఆమెను రక్షించేదానిని. నా వల్ల తప్పు జరిగిపో-యింది. ఇప్పుడిక నేను ముసలిదానినైపోయాను. ఎగరలేని స్థితిలో ఉన్నాను. కాని ఈ విషయంలో మీకు కొంత సహాయం చేయగలను.

(సశేషము)

# గ్రీసు దేశపు పురాణ గాథలు




## వేమూరి వేంకటేశ్వరరావు


**"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."**
**Aldus Huxley. "Knowledge and Understanding"**

## ముందు మాట

నేను ఈ  వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో  ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి,"  అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో  నా కుర్చీకి ఎదురుగా  ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ  కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ  కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది  పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 5. గ్రీసు దేశపు పురాణ గాథలు: జూస్ (Zeus)

జూస్ దేవలోకానికి - అనగా, గ్రీసు దేవతలకి ఆవాసమైన ఒలింపస్ పర్వతం మీద ఉన్న అమర లోకానికి - అధిపతి. పోలికలు ముమ్మూర్తులా సరిపోవు కానీ జూస్ ని మన ఇంద్రుడితో పోల్చవచ్చు. ఋగ్వేదంలో ఆకాశానికి అధిపతి అయిన "డయుస్" పేరుకి, జూస్ కి మధ్య ఉన్న పోలిక కేవలం కాకతాళీయం కాదు. వీరిరువురి ఆయుధాలు మెరుపులు, పిడుగులు అవడం గమనార్హం.
క్రోనస్ - రేయాలకి పుట్టిన పిల్లలో కనిష్ఠుడు అయిన జూస్ జన్మ వృత్తాంతం, జూస్ గద్దెకి ఎక్కిన వయినం చూస్తే క్రోనస్ చరిత్ర పునరావృత్తమయిందా అని అనిపిస్తుంది. తన తండ్రిని పదవీ భ్రష్టుడిని చేసి, టార్టరస్ లో బందీ చేసి జూస్ గద్దెకి ఎక్కిన ఉదంతం ఎలా నడుస్తుందో చూద్దాం.

## 5.1 జూస్ జన్మ వృత్తాంతం

తన తండ్రి యూరెనస్ శాపం ఏ విధంగా పరిణమిస్తుందో అనే భయంతో క్రోనస్ తన సంతానాన్ని మింగేసి తన కడుపులో బంధిస్తాడు. కానీ రేయా పన్నుగడ పన్ని జూస్ స్థానంలో ఒక రాయికి దుప్పటి గుడ్డ చుట్టబెట్టి క్రోనస్ కి ఇస్తుంది. ఆ రాయిని క్రోనస్ మింగేస్తాడు. ఈ విధంగా క్రోనస్ కడుపులో లోకి జూస్ వెళ్ళకుండా రక్షణ పొందుతాడు. రేయా జూస్ ని తీసుకుని క్రీట్ ద్వీపంలో, ఒక గుహలో, దాచిపెడుతుంది. అక్కడ వసంత దేవతలు ముగ్గురు జూస్ ని పెంచి పెద్ద చేస్తారు.

జూస్ పెద్దవాడు అయిన తరువాత అతని భార్య మెటీస్ ఇచ్చిన మత్తు పదార్థం కలిపిన పానీయాన్ని తన తండ్రికి ఇచ్చి క్రోనస్ వాంతి చేసుకోనేటట్టు చేస్తాడు. ఫలితంగా అప్పటి వరకు క్రోనస్ పొట్టలో కూర్చొని ఎదుగుతూన్న రేయా యొక్క మిగతా సంతానం, రాయి బయటకి వచ్చేస్తాయి.
తన తోబుట్టువులు క్రోనాస్ కడుపు నుండి విడుదల అయిన తరువాత గద్దె కొరకు యుద్ధం చెయ్యమని జూస్ క్రోనస్ కి సవాలు విసురుతాడు. పదవిలోఉన్న టైటన్లతో పదేళ్ళపాటు యుద్ధం చేసి, చివరకి, సైక్లోప్స్ (వీరికి టార్టరస్ నుండి జూస్ విముక్తి కల్పించాడు) సహాయంతో జూస్, అతని సహోదరులు విజయం సాధించారు, అదే సమయంలో క్రోనస్, ఇతర రాక్షసులు టార్టరస్ లో ఖైదు పాలవుతారు. ఆ తరువాత జూస్ తన సోదరి హేరాని పెళ్లి చేసుకుంటాడు. జూస్, అతని మిత్ర బృందం, ఒలింపస్ పర్వతం మీద స్థిరనివాసం ఏర్పరచుకుంటారు.

జూస్ కి ఏడుగురు భార్యలు. ఏడుగురు భార్యలూ అమరులే. వారి పేర్లు: మెటీస్ (Metis), థెమీస్ (Themis), యురినోమి (Eurynome), డిమిటర్ (Demeter), నెమోసిన్ (Mnemosyne), లేతో (Leto), హేరా (Hera). అయినా జూస్ కి స్త్రీ లోలత్వం పోలేదు. జూస్ అనేక



స్త్రీలతో మొత్తం 92 మంది పిల్లలకి తండ్రి అవుతాడు!

"తన కంటే గొప్పవాడు" అయిన కుమారునికి జన్మనిస్తుంది అని తెలిసి, జూస్ తన మొదటి భార్య అయిన మెటీస్ ని మాయ చేసి, ఈగగా మార్చి, మింగేసాడు. ఆమె అప్పటికే ఎథీనాని గర్భాన్న కలిగి ఉంది. ఏది ఏమయినప్పటికీ, ఎథీనా పూర్తిగా పెరిగి, యుద్ధం కొరకు దుస్తులు, ఆయుధాలు ధరించి, జూస్ తల నుండి బయటికి వస్తుంది.

జూస్ కి నెమోసిన్ తో పుట్టిన తొమ్మిది మంది అడ పిల్లల్ని “మూజ్” (Muse) లు అంటారు. తల్లి నెమోసిన్ జ్ఞాపక శక్తికి అధిపత్ని అయితే తొమ్మిది మంది “మూజ్” (Muse) లు సాహిత్యాలకి , కళలకి, శాస్త్రాలకి అధిపత్నులు. ఒక గ్రంథ రచన వంటి భృహత్కార్యం తలపెట్టినప్పుడు సాహిత్యాలకి అధిపత్ని అయిన మూజ్ ని ఆహ్వానించి పని ఉపక్రమించడం ఆనవాయితీగా జరుగుతుంది.

The Chariot of Zeus by Alfred Church. (వికీపీడియా నుండి)

### 5.2 గ్రీసు దేశపు పురాణాలలో పేర్లు

గ్రీసు పురాణాలలో పేర్లు ఎలా రాయాలో, ఎలా ఉచ్చరించాలో అన్న విషయంలో స్పష్టత లేదు. ప్రపంచవ్యాప్తంగా



జూస్

సమాచారం ఇంగ్లీషులో దొరికినంత సులభంగా గ్రీకు భాషలో కూడ దొరకదు కనుక పేర్ల యొక్క వర్ణక్రమాన్ని ఇంగ్లీషులో కూడ ఇస్తూ ఉంటాను. ఉదాహరణకి ఈ మూడు పేర్లు చూడండి: Eros, Eris, Ares. వీటిని తెలుగు లిపిలో రాసినప్పుడు Eros ని ఈరోస్ అనిన్నీ, Eris ని ఏరీస్ అనిన్నీ, Ares ని ఆరీస్ అనిన్నీ రాసేను. ఉచ్చారణలో ఇంత దగ్గరగా ఉన్న పేర్లు ఉండడానికి కారణం లేకపోలేదు; ఆ విషయం తరువాత చూద్దాం.

ఈరోస్ (Eros) మన్మధుడి లాంటి వ్యక్తి. సృష్టికి ముందు ఉన్న అవ్యక్త అస్తవ్యస్త స్థితి నుండి ఉద్భవించిన త్రయం: గాయా (భూదేవత), టార్టరస్ (పాతాళం),



ఈరోస్ (కామ దైవం). ఈరోస్ ఎఫ్రొడీటీ కొడుకు అని కొన్ని చోట్ల ఉంది.

ఏరీస్ (Eris ) కలహభోజని. ఈర్ష్య, అసూయ ఈమె తత్త్వా-లు. తగాదాలు పెట్టడంలో దిట్ట. ఈమెకి ఎక్కడా దేవాలయా-లు లేవు. ఈమె తల్లిదండ్రులు ఎవ్వరు అన్న విషయం మీద

నిర్ధిష్టమైన సమాచారం లేదు; ఒకొక్క “పురాణం” లో ఒకొక్కలా ఉంది. ఒక కథనం ప్రకారం ఈమె జూస్ కి హేరా కి పుట్టిన బిడ్డ. ఈ లెక్కని ఈమె ఒలింపియను యుద్ధ దేవత ఆరీస్ (Ares)కి తోబుట్టువు కానీ సహచరి కాని; స్పష్టత లేదు. మరొక కథనం ప్రకారం ఈమె నిక్స్ (Nyx) కి మగ సంపర్కం లేకుండా పుట్టిన బిడ్డ. ఈ కోణం నుండి చూస్తే ఈమె ఈరోస్ వలెనే ఒక అపరావతా-రం (personified concept). వేరొక కథనం ప్రకారం ఈమె నిక్స్

## ఈరోస్ (Eros)



కి ఎరిబస్ (Eribus) కి పుట్టిన బిడ్డ. ఆకాశంలో కనిపించే ఒక చిరు గ్రహానికి కూడా ఈమె పేరే పెట్టేరు.

కామదైవం అయిన ఈరోస్ (Eros) పేరు, కలహభోజని అయిన ఏరీస్ (Eris) పేరు ఒక-దానితో మరోకటి పోలి ఉండడం కేవలం కాకతాళీయం కాకపోవ-చ్చు. తొలిచూపులో కలిగిన కా-మోద్రేకం కాలక్రమేణా కలహాలకి దారి తీయడం చూస్తూనే ఉన్నాం కదా!

ఆరీస్ (Ares) ద్వాదశ ఒలిం-పాయనులలో ఒకడు. జూస్ కీ హేరా కి పుట్టిన బిడ్డ అయినప్ప-టికీ వారికి అయిష్టుడు. యుద్ధా-లకి అధిపతి. ఇతడే గిత్త రూపం దాల్చి మానవమాత్రుడైన పేరిస్ పెట్టిన పందెంలో గెలిచినప్పుడు పేరిస్ నిష్పక్షపాత బుద్ధి దేవలో-కంలో తెలుస్తుంది. ఇతని సహ-చరులలో ముఖ్యులు డైమోస్ (Deimos), ఫోబోస్ (Phobos). యుద్ధరంగంలో ఆరిస్ రథాన్ని నడిపే వ్యక్తులు. కలహభోజని ఏరీస్ (Eris) కూడా ఇతని సాహ-చర్య వర్గం లోనిదే!




ఆరీస్ (*Ares*)



(ఇంకా వుంది)

# ప్రేమంటే ఇంతే



(గతసంచికతరువాయి)

## ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

"ఆనువుగాని చోట అధికులమనరాదు అన్నారు ఇక్కడ మెజార్టీ మీది, అందుచేత నో కామెంట్స్" అన్నాడు కృష్ణమోహన్.

"అంటే దానర్ధం సత్యభామ ఎంట్రీ కూడా వుందన్నమాట" ఇంకా ఏడిపిస్తూ అంది రుక్మిణి.

"బాబూ! లొంగిపోతున్నాను, సత్యభామ వేరే లేదు, రుక్మిణి సత్యభామ ఒక్కరే డబల్ రోల్, ఇక పద బయలుదేరుదాము" అన్నాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ దంపతులిద్దరిని కారు దాకా దిగబెట్టి, వీడ్కోలు చెబుతూ "బావా! ఒక్క విషయం నాకు చాలా ఆనందాన్ని కలుగజేసింది, అదేమిటో తెలుసా? 23 సంవత్సరాల క్రిందట నువ్వు రాధకి ఇచ్చిన వాగ్దానానికి భంగం కలగకుండా నిన్ను విజయవతంగా అడ్డుకున్నందుకు నాకు ఆనందమే కాదు, ఒకింత గర్వంగా కూడా వుంది" అన్నాడు అవినాశ్.

"థ్యాంక్యూ బావా, నా పట్ల నువ్వు చూపిన నీ భాద్యతకి నిజంగా నీకు ఋణపడి వున్నాను. నువ్వు నన్ను అడ్డుకుని వుండకపోతే, నేను రాధకిచ్చిన మాట తప్పి ఉంకో తప్పు చేసి వుండేవాడిని. దానికి నేను జీవితాంతం బాధ పడేవాడిని. ఈ వ్యవహారంలో మొండిగా ప్రవర్తించాను, కటువుగా మాట్లాడాను ఐ యాం సారీ అపార్ధం చేసుకోకు" అని నొచ్చుకున్నాడు కృష్ణమోహన్.

"ఎంతమాత్రం కాదు బావా" అని పరిస్థితిని తేలిక చేసేందుకు "ఏం చేస్తాము బాబూ, ఆడపిల్లని ఇచ్చుకున్నాము, అన్నీ భరించాలి. అమ్మా రుక్మిణి మీ ఆయనని నీకు జాగ్రత్తగా అప్పగించాను, ఇక గోపికలబారి నుండి ఎలా కాపాడుకుంటావో నీదే బాధ్యత" అని చమత్కరించాడు అవినాశ్. అతని మాటలకి ఆ దంపతులు మనసారా నవ్వుకున్నారు.

"అన్నయ్యా, మీ బావగారు తన పేరు సార్ధకం చేసుకుంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు, ఎందుకంటే అప్పుడు నా బాధ్యత కూడా తగ్గుతుంది" కృష్ణమోహన్ వంక చూసి నవ్వుతూ అంది రుక్మిణి.

"అది సరేగాని బావా, రేపు ఉదయం లావణ్యని పెళ్ళి కూతురు చేస్తున్నారు ఉదయాన్నే నువ్వు తప్పకుండా రా" విషయం మారుస్తూ అన్నాడు కృష్ణమోహన్.

"అలాగే వస్తాను, నీకు రుక్మిణి రాక ముందు చెప్పింది గుర్తుందా? నువ్వు ఉల్లాసంగా వుండాలి. ఓకే గుడ్ నైట్" అన్నాడు అవినాశ్.

"అలాగే బావా! ఓకే గుడ్ నైట్" అంటూ కారు స్టార్ట్ చేసాడు కృష్ణమోహన్.

కారుని నెమ్మదిగా పోనిస్తున్నాడు కృష్ణమోహన్. అవినాశ్ ఇంటి దగ్గర బయలుదేరి పది నిముషాలయింది, ఇంతవరకూ భార్యాభర్తలిద్దరూ మౌనంగా వున్నారు. అతనికి మళ్ళీ ఆలోచనలు మొదలయ్యాయి. రాధ కనిపించిన దగ్గరనుండి తన ప్రవర్తన గురించి రుక్మిణి ఏమనుకుంటున్నాది? ఎట్టి పరిస్థితులలో రుక్మిణి తనని అపార్ధం చేసుకోకూడదు. రాధ విషయంలో నేను కొంచెం అతిగా స్పందిస్తున్నానా? ఎందుకోగాని రాధని చూసిన దగ్గర నుండి నాకు దుఃఖం ఆగడం లేదు, బహుశా రాధ జీవితంలో కష్టం వచ్చినపుడు తను ఏ సహాయం చేయకపోయినా, కనీసం సానుభూతి కూడా వ్యక్తపరచలేదు అన్న బాధ తనని దహించివేసి నిలవనీయటం లేదు. ఏదో కాలం తెచ్చిన మార్పులతో ఇన్నాళ్ళూ మరచిపోయినా, ఈ రోజు రాధ కనబడటంతో ఒక్కసారి మనసులో దాగి వున్న బాధ లావాలా పేలి బయటకి వస్తున్నాది...ఇంతలో స్టీరియోలో "నిన్ను నిన్నుగా ప్రేమించుటకు, నీకోసమె కన్నీరు నించుటకు నేనున్నాని నిండుగ పలికే తోడొకరుండిన అదే భాగ్యము అదే స్వర్గము" అని వినిపించింది. ఆ తోడే కదా రాధకి కరువైంది అని బాధ కలిగింది


కృష్ణమోహన్కి. గత పదిహేను నిముషాల నుండి మౌనంగా కారు నడుపుతున్న కృష్ణమోహన్ వంకే చూస్తున్నాది రుక్మిణి. అయితే రుక్మిణి చూస్తున్నట్లు అతను గమనించ లేదు.

అతను మళ్ళీ రాధ గురించి ఆలోచిస్తున్నాడని రుక్మిణి గ్రహించి "ఏమండీ! ఒకసారి కారు ఆపండి" అంది.

కారు ఆపుతూ "ఏమయింది రుక్కూ" అని అడిగాడు

"ఆ ప్రశ్న నేను అడగాలి మళ్ళీ రాధ గురించే ఆలోచిస్తున్నారు కదూ! ఏమిటండి ఇది? ఇలా రేపు మీరు నలుగురి దృష్టిలో పడితే నానా రకాలుగా అనుకుంటారు, దానివల్ల ఎక్కువ నష్టపోయేది అనూరాధ అందుకని కాస్త ఆలోచించండి. అదీగాక భవిష్యత్తులో మీరిలా అస్తమాటూ ఆలోచిస్తూ బాధపడి కుమిలిపోతే మీ ఆరోగ్యం ఎక్కడ దెబ్బ తింటుందోనని నాకు భయం వేస్తున్నాది. మీ ఆరోగ్యం గురించి, నా గురించి, పిల్లల గురించి ఆలోచించండి" అని తన ఆవేదనని చెప్పింది రుక్మిణి.

"సారీ రుక్కూ, నా ప్రవర్తన కి చింతిస్తున్నాను. ఆలోచనలని ఎంత నియత్రించుకుందా మనుకున్నా ఆపుకోలేక పోతున్నాను. నా చేష్టల వలన నీ మనసులో నువ్వు పడుతున్న ఆవేదన నాకు తెలుసు, లోకం ఏమనుకుంటుందో నాకు తెలుసు. అన్నీ తెలిసి కూడా నేనిలా వున్నానంటే, నా మనసులో నేను పడుతున్న సంఘర్షణని అర్ధం చేసుకో రుక్కూ. ఈ ప్రపంచం మొత్తం నన్ను అపార్ధం చేసుకున్నా నేను లెఖ్ఖ చేయను, నువ్వు మాత్రం సరిగా అర్ధం చేసుకుంటే చాలు. మనిద్దరి మధ్య అపార్ధాలకు తావు వుండకూడదు, అందుకని దయచేసి నన్ను సరిగా అర్ధం చేసుకో...కాలం ఎంతటి గాయాన్ని అయినా మాన్పుతుందంటారు, 23 ఏళ్ళ క్రితం ఏర్పడిన గాయం నయం కాలేదా, కంగారుపడకు ఈ రోజు వున్న ఆవేదన రేపటికి తగ్గుతుంది,. దగ్గరలో ఏదో దుకాణం తెరచి వుంది పద ఏదైనా తాగుదాము, కాస్త రిలీఫ్గా వుంటుంది" అని రుక్మిణి ఆవేదనని తొలగించడానికి ప్రయత్నం చేసాడు కృష్ణమోహన్.



"ఏమండీ నేనొక సలహా ఇస్తాను, దయచేసి తప్పుగా అర్ధం చేసుకోకండి"

"ఏమిటది?"

"లావణ్య పెళ్ళి అయిన మర్నాడు అనూరాధని మనింటికి రమ్మని మనిద్దరం పిలుద్దాము. ఆ తరువాత రోజు అంటే ఇరవైనాల్గవ తేదీన మీరు ఆవిడని తీసుకొని కారులో ఒక లాంగ్ డ్రైవ్కి అన్నవరం వెళ్ళి రండి. భోజనము కూడా బయటే తినేయండి. ఉదయం నుండి సాయంత్రం వరకు మీ మీ మనసులోని బాధలని, మీ కష్ట సుఖాలని మనసు విప్పి మాట్లాడుకోండి. అలా మాట్లాడుకోవడం వల్ల మీరిద్దరూ మీ హృదయాలలో పడుతున్న ఆవేదనలని, బాధని పంచుకుంటారు, దానివల్ల మీ మనసులు తేలిక పడతాయి. ఆ సత్యనారాయణస్వామి దర్శనం చేసుకోవడం వల్ల మీరిద్దరూ మీ మీ మానసిక సంఘర్షణల నుండి బయటికి వచ్చి మామూలు స్థితికి వస్తారు" అని సలహా ఇచ్చింది రుక్మిణి.

కృష్ణమోహన్కి ఆ సలహా విన్న వెంటనే సరదాగా ఆట పట్టిస్తున్నాదేమోఅనుకొని,

"రుక్కూ! ఏమిటి మాట్లాడుతున్నావు నన్ను ఎందుకిలా ఆట పట్టిస్తావు" అన్నాడు.

"లేదు, నేను సరదాకి అనడం లేదు, నిజాయితీగా చెబుతున్నాను"

"అసలు నీ ఆలోచన ఏమిటి రుక్కూ. మేము అన్నవరం వెళ్ళిన సమయంలో ఎవరైనా రాధ గురించి అడిగితే ఏం చేస్తావు? లేని సమస్యలు సృష్టించుకోవద్దు, దానివల్ల ఎటువంటి పరిస్థితి మనం ఎదుర్కోవలసి వస్తుందో? వద్దు అలాంటి ఆలోచన వద్దు"

"అది పెద్ద విషయం కాదు నేను సంబాళిస్తాను. రేపు లావణ్యని

పెళ్ళి కూతురిని చేసిన తరువాత అనూరాధని ఆహ్వానిద్దాము, అయితే అన్నవరం ట్రిప్ గురించి ప్రస్తుతానికి రహస్యంగా వుంచుదాము. అనూరాధని ఆహ్వానించే. ముందు ఈ విషయం అవినాశ్ అన్నయ్యతో కూడా చర్చిద్దాము సరేనా? మీరు ఇంకేమీ ఆలోచించకండి, నేను, అవినాశ్ అన్నయ్య చూసుకుంటాము, రాత్రి పన్నెండు దాటింది, పదండి బయలుదేరుదాము"

"అవును పద, రేపు ఉదయాన్నే లేవాలి"

కృష్ణమోహన్ రుక్మిణి గురించి ఆలోచిస్తూ కారు డ్రైవ్ చేస్తున్నాడు...అసలు రుక్మిణి ఇలాంటి సలహా ఇస్తుందని కలలో కూడా అనుకోలేదు. నిజానికి తనే రుక్మిణితో చెప్పి రాధని ఏ బీచ్కో తీసుకు వెళ్ళి మనసు విప్పి మాట్లాడి వద్దామనుకున్నాడు, కాని ఆ ప్రతిపాదన రుక్మిణి చేయడం ముదావహము. తన భర్తని ఉంకొక స్త్రీతో వెళ్ళి వాళ్ళ కష్టసుఖాలు మాట్లాడుకుని వాళ్ళు పడుతున్న ఆవేదనలు సంఘర్షణల నుండి ఉపశమనం పొందమని సలహా ఇవ్వడం రుక్మిణి సంస్కారానికి, గొప్పతనానికి తార్కాణం. ఆమె ఇచ్చిన సలహాతో అతనికి కొంత ఊరట కలిగింది. ఇదివరకు కంటే ఇప్పుడు రుక్మిణి ఇంకా ఉన్నతంగా కనబడుతున్నాది, ఎంతైనా ఎం.ఏ (సైకాలజీ) చదివింది కదా!!! అనుకున్నాడు. ఇంటికి చేరుకున్న తరువాత ప్రొద్దున్న నుండి శరీరం అలసి వుండడం వల్ల రుక్మిణి వెంటనే నిద్ర పోయింది. కృష్ణమోహన్ మాత్రం తన వాక్మాన్లో మాండొలిన్ శ్రీనివాస్ వాయించిన కీర్తనలు విన్న తరువాత మనసులోని అశాంతి కాస్త తగ్గి నిద్రలోకి జారుకున్నాడు.

*********

ఉదయం ఐదు గంటలకి రుక్మిణి లేచి, పిల్లలిద్దరిని లేపి తను స్నానం చేసి పూజ చేసుకొని అప్పుడు కృష్ణమోహన్ని లేపింది. అందరూ తెమిలి ఆరున్నర కల్లా పెళ్ళివారి ఇంటికి చేరుకొన్నారు. కృష్ణమోహన్ కారు దిగేటప్పటికి అవినాశ్ ఎదురుగా కనపడి "బావ, ఎలా వున్నావు? నిన్న రాత్రి నువ్వు రమ్మంటే అలాగే అనేశాను కాని మీ చెల్లెలు ఇవాళ వస్తున్నాది, పిక్ అప్ చేయడానికి వెళుతున్నాను. సరే మీ అందరికీ ఒక సారి కనిపించి ముఖ్యంగా లావణ్యకి హాయ్ చెప్పి వెళదామని వచ్చాను"

"సరే, నేను నీ చెల్లెలు నీతో మాట్లాడవలసిన విషయం ఒకటి వుంది, అందుకని నువ్వు అందరిని పలకరించి రా, తిరిగి వెళ్ళేటపుడు మాట్లాడుదాము" అన్నాడు కృష్ణమోహన్.

అవినాశ్ లోపలికి వెళ్ళి అందరినీ కలిసి పలకరించి, పెళ్ళికూతురికి శుభాకాంక్షలు చెప్పి బయటకు వస్తూ వుంటే అనూరాధ, వాళ్ళ కుటుంబ సభ్యులు కనబడితే వారందరితో కాస్సేపు మాట్లాడి అనూరాధని వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించాడు.

అవినాశ్ వచ్చిన తరువాత కృష్ణమోహన్, రుక్మిణి అవినాష్ని అతని కారుదాక దిగబెట్టి అక్కడ రాత్రి రుక్మిణి ఇచ్చిన సలహా గురించి చెప్పి "నీ ఉద్దేశ్యం ఏమిటి బావా" అని కృష్ణమోహన్ అడిగాడు.

"మా చెల్లెలు చక్కటి సలహా ఇచ్చింది, నువ్వు అనవసరమైన ఆలోచనలు చెయ్యకుండా అమలు చెయ్యి. నేను అనూని మా ఇంటికి రమ్మని ఇప్పుడే ఆహ్వానించాను. ఏదైనా తేడా వస్తే మా ఇంటికి వెళ్ళారని రుక్మిణి చెబుతుంది, నేను మా చెల్లెలు సంబాళిస్తాము. సరేనా నేను బయలుదేరతాను" అని రుక్మిణి చెప్పిన సలహాని సమర్థించాడు అవినాశ్.

ఇంట్లోకి తిరిగి వెళుతూ వుంటే రాజేశ్వరరావు, కవిత ఎదురయి "ఏంటి పెద్దమనిషివి, రాత్రంతా గాయబ్ అయిపోయావు. నీతో కలిసి కార్డ్స్ ఆడుకుంటూ కబుర్లు చెప్పుకుని కాస్సేపు సరదాగా గడుపుదాము అనుకుంటే మనిషివి పత్తాలేవు" అన్నారు.

వెనకాలే అనురాధ వచ్చి "గుడ్ మార్నింగ్" అని కృష్ణమోహన్ని పలకరించింది.

"గుడ్ మార్నింగ్ రాధా" అని "రాజా ఈ రోజు మధ్యాహ్నం భోజనాలు అయినాక ఒక రెండు గంటలు కార్డ్స్ ఆడుకుందాము. నేను చాలా కాలం అయింది ఆడి" అని రాజేశ్వరరావుతో అన్నాడు కృష్ణమోహన్.

"నువ్వు చాలా అదృష్టవంతుడివి అన్నయ్యా! నీకు ఈ రోజు రెండు గంటలు అపాయింట్మెంట్ ఇచ్చాడు" అని కృష్ణమోహన్ ప్రక్క తిరిగి "సార్, మేము కూడా మీ అపాయింట్మెంట్ అడిగాము, మాకింకా ఇవ్వలేదు.

(ఇంకా వుంది)

# భయం



పాలకుర్తి రామమూర్తి

(గత సంచిక తరువాయి)

ధైర్యంగా మీరొక నిర్ణయం తీసుకున్నారు. అది మీ జీవితాన్ని మార్చేస్తుంది. అది ఎట్లైనా కావచ్చు. సాహసంతో ముందడుగు వేస్తే మీ తరతరాల చరిత్రను మీరు మార్చేస్తారు. కాని మీలోని అంతర్గత భయం ఆ నిర్ణయానికి అనుక్షణం అడ్డు తగులుతుంది.

ఉదాహరణకు.. మీరొక ఉన్నతోద్యోగి. 45 సవత్సరాల వ్యక్తి అనుకుందాం. ధైర్యం చేసి ఏదైనా వ్యాపారం చేయాలని అనుకున్నారు. దానికి తగ్గ సమాచారాన్ని సమగ్రంగా సేకరించారు. ఎన్నో కోణాలలో ఆలోచించారు. అన్ని విధామైన పరిణామాలను బేరీజు వేసుకున్నారు. అన్ని అవసరమైన విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉద్యోగానికి రిజైన్ చేయాలనుకున్నారు. అదృష్టం కలిసి వచ్చి మీరు వ్యాపారంలో విజయం సాధిస్తే మీ కలలు నెరవేరడమే కాదు, తరతరాలుగా మీ కుటుంబం అభ్యుదయ మార్గంలో నడుస్తుంది. అలాకాక, అపజయం పాలైతే పాతాళానికి దిగజారుతారు. కుటుంబమే కష్టాల పాలుగావచ్చు. ఈ పరిస్థితులలో ఎందరో మీ శ్రేయోభిలాషుల ముసుగులో వెనుకకు లాగే ప్రయత్నం చేస్తారు. జాగ్రత్తలు చెప్పవలసిన సమయంలో భయాలు చెపుతారు. వారి సూచనలు, మాటలు విన్న మీ మనసు మిమ్మల్ని అడిగే ప్రశ్నలు....



1) నీ నిర్ణయం సమంజసమేనే?

2) నీ లక్ష్యం అసాధ్యమైనది కాదా... నీ గమనంలో ఎదురయ్యే సమస్యలు చాలా బలమైనవి. వాటిని అధిగమించే ధైర్యం నీలో ఉన్నదా?

3) చక్కగా ఉన్న ఉద్యోగం వదిలేసి క్రొత్త మార్గంలో తెలియని రంగంలో అడుగు పెట్టడం ఎంత వరకు సమంజసం

4) ఒకవేళ అందులో అపజయం పాలయితే... ఉన్న ఉద్యోగమూ పోతుంది... మళ్ళీ ఉపాధికై ఎదురు చూస్తూ మరొకరి అడుగులకు మడుగులొత్తాల్సిన అవసరం వస్తుంది.

5) ఇన్ని సంవత్సరాలుగా నీవు దాచుకున్న సొమ్ము పోతుంది. ఉపాధి ప్రశ్నార్థకమౌతుంది. నీపై ఆధారపడిన పిల్లల భవిష్యత్తు ఆలోచించావా?

6) బాంకులకు కుదువ పెట్టిన నీ ఆస్తిపాస్తులు హరించుకు పోతే... ఈ వయసులో నీకు అనుకున్న ఉద్యోగం మళ్ళీ రాకపోతే జీవితాన్ని ఎలా సాగిస్తావు?

ఇలా ఎన్నో ప్రశ్నల రూపంలో అంతర్గత భయం పలకరిస్తే... ముందుకు పోవడం సాధ్యపడుతుందా? దీనికి

బంధు మిత్రుల జోడింపులు తోడైతే పరిస్థితి ఎలా ఉంటుంది?

నిజానికి అనిశ్చిత స్థితి, తికమకలు, అనుమానాలు, అభద్రతా భావనలు, అపనమ్మకం ఇవే అంతర్గత భయానికి ఆప్త మిత్రులు. అసలే కోతి ఆపై కల్లు త్రాగిందన్నట్లుగా ఉంటుంది. భయం మనలను ముందుగా తట్టి లేపుతుంది... పై భావనలు దానిని బలోపేతం చేస్తాయి. అంతే కాదు, ఇంతకు ముందు ఇలా ప్రయత్నించి విఫలులైన వారి చరిత్రల సినిమాలను మనకు చూపిస్తుంటాయి. అంతర్గత భయం చెపుతుంది...

1) నీవున్న మండలం భద్రమైనది (Safe Zone)

2) నీవు నడవాలనుకున్నది అనిశ్చితమైనది, అభద్రమైనది (Uncertain & Unsafe Zone)

3) నీవు క్రొత్త మార్గంలో విజయం సాధించావనే అనుకుందాము... దాని వల్ల నీకొచ్చే అదనపు ప్రయోజనం ఏమిటి?

4) నీ కిప్పటికే అవసరమైన దాని కన్నా హెచ్చుగా డబ్బు ఉన్నది. అధికారం ఉన్నది. సమాజంలో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఇంకా ఏమి కావాలని క్రొత్తదనాన్ని కోరుతున్నవు

5) కొత్తగా పూనుకున్న పనిలో కలసి రాకపోతే... ఇబ్బందులు అపారమైతాయి. నీకు నష్టం వచ్చినా నీ పనివారికి జీతాలివ్వాలి, ప్రభుత్వానికి పన్నులు కట్టాలి, బ్యాంకులకు అప్పులు కట్టాలి.... ఇలా అవసరం లేని తలనొప్పులు అవసరమా? ఆలోచించు...



దీని వల్ల కలిగే అనిస్చిత స్థితిలో నిర్ణయం తీసుకోవడంలో స్పష్టత కఱవవుతుంది. అనుమానాలు సకారాత్మక భావనల పరిధిని విస్తరింప చేస్తాయి. అంతర్గత భయాలు పడగ విప్పి బుసలు కొడతాయి. దానితో నకారాత్మక వైఖరి తిష్ట వేసుకు కూర్చుంటుంది... భయానికి బలాన్ని ఇస్తుంది.

నిజానికి FEAR... అంటే False Evidence Appearing Real మాత్రమే. అది మరచి పోతే మన దారిలో FAIL కు మార్గం వేస్తుంది. .. FAIL అంటే First Attempt In Learning అనే విషయాన్ని మఱచి పోతాము FAIL ను Failure గా మలుచుకుంటాము. మనసులో నకారాత్మక వైఖరి విస్తరించడం వల్ల Failure శాశ్వతత్వాన్ని సంతరించుకుంటుంది.

ఒక నాయకుడు పదవిలో ఉన్నంతకాలం తనను ప్రజలు మరచిపోరనే భావనతో ఉంటాడు... ఒకసారి ఓడిపోగానే ప్రజలు తనను మరచిపోతారనే నకారాత్మక భావనతో అడ్డదారులలో ప్రయాణిస్తూ తన ఉనికిని చాటుకునే ప్రయత్న చేస్తాడు. అవాస్తవాలను ప్రచారం చేయడం, చేయలేని పనులను హామీలుగా ఇవ్వడం లాంటి అవాంఛనీయ సంగతులకు శ్రీకారం చుడుతాడు. అసహజ మార్గాలలో తన ఉనికిని చాటుకునేందుకు ఏ మార్గాన్నైనా వెళ్ళేందుకు వెనుదీ-

యడు. ఇదంతా తాను గెలవలేననే అంతర్గత భయం వల్లనే.

కొందరు తమ అంతర్గత భయాన్ని గుర్తించి భయాన్ని అధిగమించే విధానాన్ని ఆలోచిస్తారు. అందులో భాగంగా దానిని మచ్చిక చేసుకునే విధానాన్ని ఆలోచిస్తారు. అపజయం మనిషిని ఉన్న స్థానంలోనే పాతిపెట్టేస్తుంది. ఉన్నత స్థానానికి వెళ్ళే అన్ని మార్గాలను మూసివేస్తుంది.

ఓడిపోతామనే భయం ప్రతిభావంతులను కూడా ప్రయత్నించనీయదు. ప్రయత్నలోపం కన్నా ప్రయత్నించి ఓడిపోవడం మంచిదనే ఆలోచనను రానీయదు. అంతర్గత భయాన్ని అధిగమించిన వారు, ప్రతిభాహీనులైనా, నైపుణ్యాలు లేకున్నా సాధించాలనే తమ వైఖరి మూలంగా ఆయా రంగాలలో ముందుకు సాగిపోతారు. సామర్థ్యం ఉన్న యువతరం కూడా సవాళ్ళతో కూడిన ఉద్యోగాల వైపు చూపును పెట్టకపోవడం శోచనీయాంశం. దానికి కారణం భయం తప్ప మరేదీ కాదు.

చివరగా... ఉన్నత పదవిలో ఉండే వ్యక్తుల మనసులో ఈ భయాన్ని వెలుగు చూడనిస్తే... వారి సృజనాత్మకత మరుగున పడుతుంది. సత్వరమే ఉచిత నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం నిర్వీర్యమౌతుంది. అంతర్గతంగా ఒత్తిడి పెరిగి నకారాత్మక వైఖరిని సంతరించుకుంటారు. సాధించాలనే తపన ఆశయాలు చల్లారి విఫల మనోరథులై (Frustration) నిస్తేజమైన జీవితానికి అలవాటుపడతారు. వీరిలోని మానసిక చైతన్య దీప్తి అట్టడుగు స్థాయికి చేరుతుంది.



ఇదీ మనలో భయం చేసే విధ్వంసం... నా అవగాహన మేరకు.....

భయాన్ని అధిగమించేందుకు మార్గాలు.....

సహజంగా డబ్బు లేకపోవడానికి కారణం సంపద మీద మనం దృష్టిని కేంద్రీకరించలేకపోవడం, అంటారు. నా దగ్గర అవసరానికి సరిపడ డబ్బు లేదు అనుకున్నంత వరకు అది మన వద్దకు చేరదు. ఎందుకంటే డబ్బు లేదు అనే భావనకు మనసును పరిమితం చేస్తున్నాము, కాబట్టి. మన ఆలోచనలన్నీ దానికే పరిమితం చేస్తున్నాము. మనసు దేనిని గూర్చి ఆలోచిస్తే దానినే ఆకర్షిస్తుంది. చిన్నప్పుడు మనకు పెద్దవారు తథాస్తు దేవతలు ఉంటారు చెడుకోరుకోకు అనే వారు. దానికి ఇదే కారణం. మన జీవిత నిర్వహణా కేంద్రం దేనికి పరిమితమైతే దానినే ఆకర్షిస్తుంది. ఒక కలెక్టర్ ఉద్యోగం రావాలని చిన్నపిల్లవాడు లక్ష్యం నిర్దేశించుకుంటే తను ఆ చదువుకు తయారయే విధానంలో భాగంగా తాను కలక్టర్ అయితే ఎలా ప్రవర్తిస్తాడో అలా తన హావభావాలు, మాటతీరు, ప్రవర్తనా పద్ధతి, వస్త్రధారణను కూడా మార్చుకోవాలి. అంటే తాను తన లక్ష్యానికి అనుగుణంగా తన జీవన నిర్వహణా కేంద్రాన్ని నిర్మించుకోవాలి. అప్పుడే

లక్ష్యం ఆకర్షితమౌతుంది. ఆకర్షిత లక్ష్యానికి అనుగుణంగా ప్రయత్నం జరిగితే లక్ష్యం సుగమమౌతుంది... లేదా సాకారమౌతుంది.

ఇదే ఉదాహరణ భయాన్ని జయించేందుకూ పనికి వస్తుంది. ధైర్యం, సాహసం మన అంతర్గత బంధువులుగా ఊహించుకోవడం వల్ల భయం ప్రక్కకు ఒదిగి ఉంటుంది. నిజానికి ధైర్యం మనకు సహజాతం. భయమే అరువు దెచ్చుకున్నది. చిన్న పిల్లవాడిని చూడండి... పిల్లలు రెండింటికే భయపడతారు... ఒకటి.. పెద్దగా చప్పుడు చేస్తే ఉలిక్కిపడతారు... రెండవది.. క్రిందికి చూస్తే భయపడతారు. ఆ రెండింటికి తప్ప మరిదేనికీ భయపడరని మానసిక శాస్త్రజ్ఞులు చెపుతారు. మరి మనకు ఇన్ని భయాలు ఎందుకు వచ్చాయి. అంటే.. జాగ్రత్తల పేరుతో తల్లిదండ్రులు, తోటిపిల్లలు, ఉపాధ్యాయులు, సమాజం, చుట్టూ ఉండే పరిస్థితులు... ఇవన్నీ భయాలు మన మనసుకు సూచనలుగా అందిస్తావి. ఆ సూచనలు అంతర్మనస్సులో ముద్రలుగా పడి ప్రతి నిత్యమూ సమాజం అందిస్తున్న సూచనలతో మరింత బలోపేతమై ఆ భయాలకు బంధీగా మారుతుంది. ఒక అయిదు సంవత్సరాల బాలుడు




పామును పట్టుకొని ఆడుతాడు అదే ఇరువది సంవత్సరాల యువకుడు పామును చూడగానే పారిపోతాడు. కారణం వారి వారి మనసులకు పాము గూర్చి ఇవ్వబడ్డ సూచనలతో బలోపేతమైన మనో నిర్వహణా కేంద్రం మాత్రమే. అందుకే భయం స్థానంలో "అభయాన్ని" ఊహించుకుంటే భయం అభయంగా మారిపోతుంది. భయం పారిపోతుంది, అభయం నిలిచిపోతుంది.

మీకు తెలిసినదే అయినా ఒక విషయాన్ని మరొక సారి గుర్తు చేస్తున్నాను. ధ్యానం వల్ల మనస్సు బలోపేతమౌతుంది. ధ్యానంలో ఏం జరుగుతుంది? మన మనస్సుకు సూచనలు ఇచ్చుకుంటాము. ఏ విధమైన సూచనలు ఇస్తాము? సకారాత్మకమైన సూచనలు ఇవ్వడం జరుగుతుంది. ఆ సూచనలనే "అఫర్మేషన్స్" అంటాము. ధ్యానానికి కూర్చున్న సమయంలో ఒకసారి ఇచ్చుకున్న సూచనలను అంతర్మనస్సు గ్రహించి ఆ సూచనలు సాకారమయ్యేందుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తుంది. తదుపరి ధ్యానంలో నిరాలోచనా స్థితిని పొందిన మనస్సు అంతకు ముందు ఇచ్చుకున్న సూచనలను అమలు చేసేందుకు సన్నద్ధమౌతుంది. ఆ విధానానికి అవసరమైన అన్ని అంశాలను ఆకర్షిస్తుంది. ఆ ఆకర్షణ ఫలితంగా అన్నీ మన ముందు ఆవిష్కృతమౌతాయి. ఇది యోగాభ్యాసంలో చెప్పే అష్ట సిద్ధులలో ఒకటి.

---------

ధ్యానంలో ఇచ్చుకోవలసిన సూచనలు లేదా Affirmations....

1) భయం అనేది సహజాతం కాదు, దత్తత తీసుకున్నది మాత్రమే

2) దానిని ఈ క్షణమే నేను విడిచి పెడుతున్నాను

3) శ్వాస తీసుకుంటూ... ఈ విధంగా

ఊహించుకోండి... నేను తీసుకునే ప్రతి ఉఛ్వాస నాలోని అణువణువునా ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది

4) శ్వాసను వదులుతూ... ఈ విధంగా ఊహించుకోండి... నేను విడిచి పెట్టే ప్రతి నిశ్వాస నాలో ఉన్న భయాలను ఆందోళనలను బయటకు పంపిస్తుంది

5) ప్రతి నిశ్వాస భయాన్ని పారద్రోలగా ఆ స్థానంలో ఉఛ్వాస ఆత్మ విశ్వాసాన్ని నింపుతుంది

6) ఇది నిరంతర ప్రక్రియగా నాలో సాగుతుంది


7) ఈ ఉఛ్వాస నిశ్వాసల వల్ల భయం మరియు దానికి సంబంధించిన అన్ని నకారాత్మక భావనలు నాలో నుండి బయటకు వెళ్ళిపోతున్నాయి

8) నేను కనులు మూసుకోగానే ఆ ప్రక్రియ ఆరంభమవుతుంది.... దీనినే NLPలో Anchoring అంటారు.

9) చక్కని నిర్భయ స్థితిలో నా మనసు చక్కని ఆలోచనలు చేస్తుంది

10) ఈ ప్రక్రియ ఫలితంగా సమగ్రత, సంయమనత, సృజనాత్మకత, సమభావన, సంపూర్ణత నా ఆలోచనలో అంతర్భాగమవుతున్నాయి.

ఇలా ఎన్ని మార్లు వీలైతే అన్ని మార్లు అవకాశం మేరకు మనసుకు సూచనలు ఇచ్చుకోవడం ద్వారా మనసు మాలియై ఆ సూచనలను అమలు పరచే యంత్రాంగాన్ని సన్నద్ధం చేసుకుంటుంది. దీనితో బలోపేతమైన అంతర్మనస్సు ఆ ఆలోచనలు సాకారమయ్యే వాతావరణాన్ని కల్పిస్తుంది.




ఇప్పుడు... మీరు కొన్ని ప్రశ్నలు వేసుకోండి...

1) మీకున్న అత్యంత ప్రాధాన్యతాంశం ఏమిటి? వరసలో వ్రాసుకోండి

2) ఎందుకు మీరు దానినే ఎన్నుకుంటున్నారు

3) ఒకవేళ దానిని సాధించే క్రమంలో మీకు అపజయం కలిగితే మీకు కలిగే నష్టం ఏమిటి?

4) వాటిని సాధించే క్రమంలో మిమ్మల్ని ఇన్నాళ్ళుగా భయానికి గురిచేసిన అంశాలేమిటి

5) వాటిని ఎలా పరిష్కరించుకోగలం

6) SWOT విశ్లేషణ చేసుకోవడం వల్ల ఉన్నతమైన ఆచరణాత్మకమైన మార్గం తప్పక కనిపిస్తుంది

7) ఎవరైనా సూచనలు ఇస్తే వాటిని మీ నిర్ణయాన్ని అమలు చేసే విధానంలో జాగ్రత్తలుగా తీసుకోండి... అంతే కాని అవి మిమ్ముల అదిగమించే విధానానికి అవకాశం ఇవ్వకండి.

8) దేనికైనా సన్నధం కాండి... ఏ నిర్ణయమైనా అది మీరు తీసుకునే నిర్ణయమే... మంచి చెడులు మీ వ్యక్తిగతమే.. మరొకరి ముద్ర వాటిపై లేకుండా జాగ్రత్తలు తీసుకోండి

9) ఈ విధానంలో మీలోని స్తబ్దతను గుర్తించి దాని నుండి బయటకు వచ్చే ప్రయత్నం చేయాలి

10) స్తబ్దత తెలుసు.. దానిని అధిగమించాలి అంటే ఏ మీటను నొక్కాలో మిమ్మల్ని మీరే బేరీజు వేసుకోండి

11) సరైన సమయంలో సరైన

మీటను నొకడం ద్వారా భయానికి చెక్ పెట్టండి

భయం అనేది మనసు యొక్క భ్రాంతి రూపం మాత్రమే. భ్రాంతికి ఒక పరిధి ఉంంటుంది. పరిధిని విస్తరిస్తే లేదా దాని పరిమితులు లయం చేస్తే అది అపరిమిత మౌతుంది. అపరిమితమైన మనస్సుకు మరొకటి కనిపించదు... కాబట్టి భయం ఉండదు.

ఒక చిన్న కథతో దీనిని ఇక్కడ ముగిస్తాను....

ఒకప్పుడు ఒక ఊరిలో 18 సంవత్సారాల ఒక యువకుడు ఉండేవాడు. పరీక్షల ముందు ఏర్పడిన "భయాన్ని" తొలగించుకునేందుకు ఒకనాడు తండ్రి అనుమతితో ప్రక్క ఊరిలో సినిమాకు వెళ్ళి వస్తున్నాడు. చీకటి అయింది. ఒక్కడే నెమ్మదిగా నడుస్తున్నాడు. తాను చూచింది టెర్రర్ సినీమా... అదే పెద్దది... రాత్రి 12 దాటింది. చుట్టూ ఎవరూ కనిపించరు... నక్కల కూతలు కీచురాళ్ల శబ్దాలు తప్ప ఏమీ వినిపించడం లేదు. నెమ్మదిగా సినిమాలోని సంఘటనలు జ్ఞాపకం వస్తున్నాయి. ఆలస్యమవడం వల్ల తండ్రి దండిస్తాడనే భయం... కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. అలవాటయిన బండ్లబాటపై నడుస్తున్నాడు. పురుగో బూచో వస్తుం-



దనే భయమూ ఆరంభమయింది. తన ఊరికి వెళ్ళాలంటే మరొక దారి ఉన్నది కాని అది చుట్టూ తిరిగి పోవాలి.. ఈ దారి వెంట వెళితే చాలా దగ్గర... తన ఊరి బయటకు వచ్చాడు. అక్కడ దూరంగా ఒక పాత బావి ఉన్నది... దానిప్రక్కనే ఒక పెద్ద మర్రిచెట్టు ఊడలు దిగి ఉన్నది. చీకటిలో దాని ఊడలు జడలు విరబోసుకున్న దయ్యం లాగా భయపెడుతున్నాయి. ఆ ఆలోచన రాగానే భయం మరింతగా పెరిగింది. తన ఊరిలో ఎన్నో కథలు ఆ బావి గూర్చి, మర్రి చెట్టు గూర్చి చెప్పుకుంటారు. ఎందరో ప్రేమికులు తమ ప్రేమ విఫలం కావడంతో ఆ చెట్టుకు ఉరిపోసుకున్నారని, అత్తల/ భర్తల పోరు పడలేక మరెందరో ఆ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారని... వారంతా దయ్యాలయి ఆ చెట్టుపై కాపురం ఉండి వచ్చిపోయే వారిని తినేస్తారని ప్రచారం ఉన్నది.

చుట్టూ తిరిగి పోతే దూరం అవుతుంది కాని అది భద్రమైన దారి. అతనిలో సందిగ్ధత... The longer but safe route or the shorter but risky route? ఇది అతనిలోని డైలమా.

అతడాలోచిస్తున్నాడు.. దగ్గరి దారిలోనే వెళతాను... ఏమవుతుంది? భూతం వస్తుంది.. వస్తే... అలాగే రాకనూ పోవచ్చు. అవకాశాలు సగం సగం... ఇంత రాత్రి భూతాలు కూడా మంచి నిద్రలో ఉండవచ్చు కదా. కాదు కాదు.. భూతాలు పగలు నిద్రించి రాత్రి మేల్కొంటావి... ఏదైనా కనిపించే ఊరిని చేరేందుకు వెనిక్కి వెళ్ళీ దూరం దారిని పట్టుకుంటే 8 కిలోమీటర్లు నడవాలి. ఒకటి రెండుఫర్లాంగుల దూరానికి 8 కిలోమీటర్లు నడవడం బుద్ధిహీనత... అందుకే ఏమైనా త్వరగా హనుమంతుని ధ్యానిస్తూ పరుగుదీసి ఆవైపు చేరు-

కుంటాను అని ఆలోచిస్తూ... కొంత దూరం నడిచాడు. అక్కడే దారి సన్నగా ఉంటుంది. అక్కడే భూతం ఉంటుందని అందరూ చెప్పుకోవడం జ్ఞాపకం వచ్చింది. అక్కడి నుండి తమ ఊరికి చేరుకునేందుకు దారి వంకరటింకరులుగా ఉంటుంది. తనలో సందేహం, ఆహనం, భయం పెరిగిపోతున్నాయి. ఒంటరితనం మరింతగా భయపెడుతున్నది. వెనిక్కి తిరిగి పోదామంటే... భూతం వెనుకనుండి పట్టుకునే అవకాశం ఉన్నది. కాబట్టి వెనుకకు పోలేడు. ముందుకు వెళ్ళడం సమస్య.. ముందుకు నడవాలంటే సమస్య... ఆ సమస్య తనపై ఒత్తిడిని పెంచుతున్నది. When you cannot go back and go forward great tension arises. That leads to great FEAR.

అతనలా ఆలోచిస్తూ ముందుకు చూడగానే దూరంగా ఒక భూతం కనిపించింది. తెల్లని బట్టలతో మెరిసే కళ్ళతో... ఎదురుగుండా దారి ప్రక్కన నడుస్తూ వెళుతున్న భూతాన్ని చూసాడు. ఆడుగులు పడకున్నా కన్నులు మూసుకొని నాలుగడుగులు వేసి కన్నులు తెరిస్తే ఆ భూతం కనిపించలేదు... ఆశ్చర్యం... భయం... అనుమానం.. ఆ భూతం ఎక్కడ? రామ రామ అనుకుంటూ ముందుకు అడుగు వేసాడు... మళ్ళీ




కనిపించిన భూతమూ అడుగులు వేసింది. తానాగాడు అదీ ఆగింది... అతను కదిలితే అదీ కదులుతుంది... నోరు తడి ఆరిపోతుంది.. శక్తినంతా కూడదీసుకొని "ఎవరూ" అంటూ అడిగాడు.. ఎదురుగుండా భూతమూ అడిగింది "నీవెవరు"? అంత భయంలోనూ అతనిలో ఎక్కడో బుర్ర పనిచేసింది. ఆ గొంతును గుర్తుపట్టాడు... తన ఊరిలో వ్యాపరం చేసుకునే శెట్టిగారి గొంతది. శేట్టి తన వ్యాపారాన్ని ముగించుకొని వస్తున్నాడు.. ఆ స్థలంలోకి రాగానే ఒక కుక్క తన నడ్డగించింది. అందుకే శెట్టి ఆగిపోయాడు. వెనుకకు చూస్తే ఈ పిల్లవాడు. పిల్లవాడిని శెట్టి భూతమనుకుంటున్నాడు... శెట్టిని పిల్లవాడు భూతమనుకున్నాడు. ఇరువురూ కలిసారు... ఇంతవరకు వారిలో ఉన్న Illision became Illumination... భ్రాంతి వెలుగుగా మారింది... సత్యము అవగతమయింది. సత్య వికాసం భయాన్ని పారద్రోలింది.

యదార్థాన్ని అవగాహన చేసుకుంటే... భయం పారిపోతుంది. ఇప్పుడు ఇరువురూ మంచి స్నేహితులైనారు. ఈ యువకుడు ఆ శెట్టిగారికి వ్యాపార లెక్కలు చూచిపెట్టాడు.. శెట్టి అతని చదువుకు అవసరమైన డబ్బు సర్దుబాటు చేసాడు. ఇరువురు పరస్పరాధారిత సూత్రంపై లాభపడ్డారు. Unknown is not danger alone but is also full of opportunities... భయం వల్ల అవకాశాలను కోల్పోతాము.. ఈ సత్యాన్ని అవగాహన చేసుకుంటే భయాన్ని పారద్రోల గలము.

నాకు భయం అంటే మా చిన్నప్పుడు మా తాతమ్మ ఈ కథ చెప్పేది. కాకపోతే కొన్ని నా జోడింపులు.

# షాహుకార్ జానకి



**పోడూరి శ్రీనివాసరావు**

తను నటించిన తొలి చిత్రం పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్న జానకి గొప్ప నటి. షాహుకార్ జానకిగా ప్రసిద్ధిగాంచిన శంకరమంచి జానకి అలనాటి రంగస్థల, సినీ కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సుమారు 400 సినిమాల్లో నటించింది. ఇందులో సుమారు 200 కి పైగా కథానాయికగా నటించింది. ఈమె రేడియో నాటికలద్వారా తన నటప్రస్థానం ప్రారంభించింది. తెలుగు, తమిళ భాషల్లో ఎన్. టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం. జి. ఆర్., శివాజీగణేశన్ లాంటి ప్రముఖ కథానాయకుల సరసన కథానాయికగా నటించింది.

జానకి 1931 వ సంవత్సరం డిసెంబర్ 12వ తేదీన రాజమండ్రిలో జన్మించి, అక్కడే పెరిగింది. తండ్రి టి. వెంకోజిరావు పేపర్ పరిశ్రమలో నిపుణులు. ఈయన ఇంగ్లాండ్ లో మూడేళ్లపాటు పేపర్ మ్యానుఫాక్చరింగ్ అండ్ కెమికల్ ఇంజనీరింగ్ చదివారు. జానకి తల్లిగారి పేరు శచీదేవి. జానకి అస్సాం లోని గౌహతిలో మెట్రిక్యులేషన్ వరకు చదివారు. అనంతరం ఆరిజోనా విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసారు. ఆమెకు 15 సంవత్సరాలకే, 1947 వ సంవత్సరము లో శ్రీ శంకరమంచి శ్రీనివాసరావు గారితో వివాహం జరిగింది.

జానకి బాల్యం నుంచీ అనేక



రంగస్థల నాటకాలలో కూడా నటించింది. తన 11 వ ఏటనే రేడియోలో ఒక తెలుగు కార్యక్ర-మంలో పాల్గొంది.తనునటించిన మొట్టమొదటి చిత్రం షావుకారు-తో ఆమె ఇంటిపేరు కాస్తా 'షావు కారు'గా మారిపోయింది. 1950 లో విజయా ప్రొడక్షన్ వారు ని-ర్మించిన చిత్రం షావుకారు. అప్పటి ప్రముఖనాయకులందరి సరసన నటించింది. జానకి 385 తెలుగు, తమిళ, కన్నడ చిత్రా-ల్లోనూ, 3 హిందీ చిత్రాల్లోనూ, 1 మలయాళం సినిమాలోనూ నటించింది. ఈమె అనేక పుర-స్కారాలను పొందింది.

కథానాయకి కృష్ణకుమా-రి ఈమెకు స్వయానా చెల్లెలు. జానకి సత్యసాయిబాబా భక్తురా-లు.జాతీయ ఫిల్మ్ అవార్డులకు, తెలుగు సినిమా అవార్డులకు కమిటీలో జ్యూరీ సభ్యురాలిగా పనిచేసింది.

ఈ దిగువ తెలిపిన సినిమాలు, జానకి నటించిన చిత్రాల్లో కొన్ని ప్రముఖమైనవి, ఆమెకు పేరు తె-చ్చిపెట్టినవి.

షావుకారు, పిచ్చి పుల్లయ్య, కన్యాదానం, వద్దంటే డబ్బు, రో-జులుమారాయి, కన్యాశుల్కం, నాగుల చవితి, జయం మనదే,



ఏది నిజం, చరణదాసి, పాండు-రంగమహత్యం, భలేబావ, భాగ్య-రేఖ, ఆలుమగలు, ముందడుగు, రేచుక్క పగటిచుక్క, శ్రీ వేంకటే-శ్వర మహత్యం, బాటసారి, మం-చిమనసులు, పెంచినప్రేమ, పెంపుడు కూతురు, సవతికొ-డుకు, డాక్టర్ చక్రవర్తి, మంచి కుటుంబం, భామా విజయం, అక్కాచెల్లెలు, రామరాజ్యంలో రక్తపాతం, సమాజానికి సవాల్, రంగూన్ రౌడీ, తాయారమ్మ బంగారయ్య, గోపాలరావుగారి అమ్మాయి, కృష్ణ గారడీ, సంసారం ఒక చదరంగం, మురళీకృష్ణుడు, స్వరకల్పన, గీతాంజలి, మేడమ్, శుభాకాంక్షలు, దేవి, హే రాం, సౌఖ్యం, బాబు బంగారం..... మొదలైనవి.

వీటిలో, షావుకారు, వద్దంటే డబ్బు, రోజులు మారాయి, కన్యా-శుల్కం, ఏదినిజం, మంచిమ-నసులు, డాక్టర్ చక్రవర్తి, మంచి కుటుంబం,అక్కాచెల్లెలు,తాయా రమ్మ బంగారయ్య, సంసారం ఒక చదరంగం మొదలైన సిని-మాలలో జానకికి మంచి పాత్రలు లభించాయి, జానకికి మంచి పేరు సంపాదించిపెట్టాయి.

తమిళనాడు ప్రభుత్వం వారిచే కలైమామణి బిరుదు పొందింది. ఉత్తమ సహాయనటిగా నంది బహుమతులు పొందింది. 89 సంవత్సరాల వయసులో ప్ర-స్తుతం జానకి బెంగళూరు లో నివాసము ఉన్నట్లుగా తెలు-స్తోంది. తెలుగు చలనచిత్రసీ-మకు లభించిన ఒక మంచి నటి జానకి.

# నవవిధ భక్తులు

ఆదూరి హైమవతి



రాజు అతనిని విచారించి అతడే రాజ్యంలోని అన్ని దొంగతనాలకూ దోపిడీలకు కారకుడని రుజువయ్యాక అతడికి మరణ శిక్ష విధించాడు.

అదితెలిసి మాధవుడు తాను జపించే రామనామాన్ని జపిస్తూనే రాజ సభకు వెళ్ళడు.

మహారాజు అతడిముఖంలోని వెలుగు చూసి" మహానుభావా! ఎవరు మీరు?" అని అడిగాడు.

దానికి మాధవుడు "మహారాజా! తమరు రాజ్యమంతా చెప్పించే పురాణ శ్రవణాలువిని రామనామామృతం లోని మాధుర్యాన్ని తెలుసుకున్న వాడిని. మీరు మరణ శిక్ష విధించిన గంగులు మా తండ్రి.మహారాజా! భగవం తుడు తన నామాన్ని జపించేవారిని కాపాడుతాడని పురాణ పండితులు చెప్పారు.మరినాతండ్రిని వదిలేయండి. ఇహనుంచీ దోంగతనాలూ, దోపిడీలు చేయ కుండా తమ నగర ముఖ్య ద్వారానికి కాపలాదారుగా నియమించి తగిన భత్యం ఇప్పించండి.ఆయన దొంగతనం చేసిన ధనమంతా తమరే తెప్పించి ఎవరిది వారికి ఇవ్వండి. నా మనవి అలకించండి" అని కోరాడు. మహారాజు అంగీకరించి గంగులును వదిలేశాడు. గంగులు పరుగునవచ్చి కుమారుని ఆలింగనం చేసుకుని "బిడ్డా! నీరామనామం నాప్రాణాలను కాచింది. నేనూ రామనామం జపిస్తూ ముఖ్య ద్వారానికి కాపలాగా ఉంటాను."అని మహారాజుకునమస్కరించాడు.

చూశావా! కుమారీ! రామనామ జపంతో దొంగ కుమారుడైన మాధవుడు బాగా విద్యాభ్యాసం చేసి ఒక గొప్ప పండితుడైనాడు తండ్రినికాపాడాడు.అది శ్రణఫలితం. "అనగానే "బామ్మా! సూపర్. మిగతావి చెప్తావా! మరి" అంది.

"తప్పకుండా చెప్తాను. కాస్త విరామం తర్వాత" అందిబామ్మ.

మొదటిదైన శ్రవణం సమాప్తం.

## కీర్తనం.

"రెండవది కీర్తనం కుమారీ!"

" అంటే ఏంటీ బామ్మా!"

"చెప్తాను వినుమరి అంటూ కొనసాగించింది"బామ్మ భానమ్మ.

'కాకుటూరు అనేగ్రామంలో చిన్నచితకా వ్యాపారులు ఉండేవారు. అది అటు పట్నమూ కాదు, ఇటు పల్లేకాదు. అక్కడినుండీ పక్కనే ఉన్న నగరానికి వెళ్ళి, వారు వారానికీ, పదిరోజులకు ఒకమారు తమ వ్యాపారానికి కావల్సిన సరుకులన్నీ తెచ్చుకుని, తమకు రావల్సిన లాభం కలుపుకుని అమ్ముకునేవారు. వారు సుమారుగా పది మంది కలసి నగరానికి వెళ్ళి సరుకులు కొనుక్కుని అంతా ఒకరికొకరు సాయంగా అద్దె బండ్లమీద సరుకువేసుకుని తెచ్చుకునేవారు.

వెళ్ళేప్పుడు సాధారణంగా అడ్డదారిన కాలి నడకన అడవిదారిన వెళ్ళేవారు. అలా వెళితే గంటలో

నవవిధ భక్తులు.



నగరం చేరవచ్చు. బండిబాటలో వెళితే మూడు గంటలు పడుతుంది. అది చుట్టుదారి. ప్రాతః కాలంలోనే సూర్యదయం వేళ కదలి అంతా నగరంచేరి సరుకులు కొని బళ్ళమీద వేసు కుని సాయంకాలానికి వచ్చేవారు. బళ్ళబాట చుట్టుదారని నడిచి వెళ్లనే ఇష్టపడేవారు.

కాలమంతా ఒకేరీతిలో సాగితే మానవుడు తానే మహనీయుడిననీ,భగవంతుడిననీ, తనకు ఎదురే లేదని భావిస్తాడు కదా-!అందుకే ఆ అడవి బాటలో ఒక దొగల గుంపు వచ్చి చేరిందనీ ఆబాటనవెళ్ళేవారిని దోపిడీ చేస్తున్నదనీ గ్రామస్తులు చెప్పుకో సాగారు.

ఐతే ఆదారిన వెళితే త్వరగా వెళతామని అటు వెళ్లనే ఇష్టపడేవారు.

ఒకరోజున పదిమంది వ్యాపారులు, సరుకులు కొనను కావలసిన ధనాన్ని తీసు కుని బయల్దేరారు నగరానికి. బయల్దేరేముందు ఆఊరిలోని విష్ణాలయంలో నమస్కరించుకుని, మొక్కుకుని వెళ్ళడం వారికి అలవాటు.

ఆరోజు బయల్దేరిన వారికి అక్కడ మాఘ పురాణం ఉదయాన్నే జరుగుతుండటాన కొద్దిసేపు విని రాహుకాలం వెళ్ళినతర్వాత బయల్దేరుదామని అక్కడ కూర్చున్నారు. పురాణ శ్రవణం జరుగు తున్నది.

పురాణం బ్రాహ్మణుడు "అయ్యలారా! భక్తిమార్గాలన్నింటిలోకీ కీర్తనం బహు తేలి కైనది. మన సారా! భగవన్నామాన్ని, మీకు ఇష్టమైన నామాన్ని,పలుకుతూ అంటే కీర్తిస్తూ 'హరేరామ హరే రామ- రామరామ హరే హరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే' అనే చిన్న వాక్యాల నైనా సరే పలుకుతూ వెళితే ఏ ఆపదా రాదు. కనుక భక్తులారా! మీలో ఎవరైతే 40 రోజులపాటు ఈ దీక్ష తీసుకుని ఈ కీర్తనం చేయను ఇష్టపడతారో వారు వచ్చి, ఈ ఎర్ర తువ్వా లు తీసుకుని తలకు కట్టుకుని, ఈ నారింజరంగు తువ్వాలు తీసి కప్పుకుని, ఈ దీక్షాకంకణం కట్టుకుని, 40 రోజులు దీక్షబూనండి. మీరేమీ మీపనులు మానుకోనక్కర లేదు. మీపనులు తోట పనో, కూలిపనో, పొలం పనో, మరొకటో చేసుకుంటూనే మనస్సులో ఈ నామ కీర్తనం చేసుకుంటూ ఉండవచ్చు. ఎవరు దీనికి ఇష్టపడతారో వారు వచ్చి ఈ దీక్షా కంకణం కట్టుకోండి" అని పిలుపునిచ్చాడు. మన పది మంది వ్యాపారులూ ఒకరి ముఖం ఒకరుచూసుకుని వారి భావాలు పరస్పరం అర్ధం చేసుకుని ముందుగా వెళ్ళి దీక్షాకంకణాలుకట్టించుకుని, భగవంతునికి నమస్కరించుకుని బయల్దేరారు.

ఎక్కడైతే భజనలు జరుగుతాయో అక్కడ వ్యాపారాలూ సాగుతాయికదా! ఆలయం బయట చిరు తలు అమ్మే అంగడి చూసి, అంతా తలో చిరుతల జతా కొనుక్కుని వారిధనాన్ని తలపాగాలో పెట్టుకుని, కట్టుకుని, కీర్తనచేసుకుంటూ అడవిదారిలో సాగారు. అడవిమధ్యలోకి వెళ్లేసరికి అక్కడు న్న పెద్ద మఱ్ఱి చెట్టుమీదనుంచీ నలు గురు దొంగలు దూకి వారి దగ్గరి ధనం దోచుకోవా లనే భావనతో వచ్చి, వారి కీర్తన విని, వారి దుస్తులు చూసి 'ఓహో వీరు భక్తులు దీక్షబూని ఏదో ఆలయానికి వెళు తున్నారనుకుని పక్కనే నిల్చుని వారి భజన కీర్తన వింటూ వారిని ఏమీ చేయక వెళ్లనిచ్చారు.


వారు కీర్తన చేసుకుంటూ ధైర్యంగా నగరానికి చేరి తమ వస్తువులు కొనుగోలు చేసుకుని అద్దె బండ్లలో సాయంకాలానికి తమ ఊరు చేరారు.ఊర్లో అంతా గోలగా ఉండటం తో ఏంటా అని విచారించగా,వారి తర్వాత అడ్డదారిన నగరానికి బయల్దేరిన వ్యాపారులను దొంగలు కొట్టి దోచు కున్నారు, వారికేకలు విని ఊరివారు వెళ్ళి వారిని బండిమీద తెచ్చి వైద్యం చేస్తున్నారుట. ఆపదిమంది వ్యాపారులూ తాము కీర్తన చేసుకుంటూ వెళ్ళడం వలన ఎలా ఆపదతప్పిందో తెల్సుకుని ఆనందించి తమ జీవితాంతం కీర్త న కొనసాగిస్తూ హాయిగా జీవించారు.

"ఇదమ్మా కుమారీ ! కీర్తనచేయడం వలన లాభం."

"బామ్మా! మరి తర్వాతది చెప్తావా!" అందికుమారి.

"తప్పక చెప్తానమ్మా!" అంది బామ్మ భానమ్మ.

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

సంవత్సరానికో సారి వచ్చి, ఓ నాలుగు రోజులుండి, అందరికీ వినోదాన్ని పంచి, విస్మయాన్ని కలిగించి, కథలు, గాథలు చెప్పి, అలరించి పోయే అతిథి 'బీగాల సాయిబు'. ఈయన పేరు ఎవరికీ తెలియదు.

బీగం చెవులు పోయిన బీగాలకు కొత్త బీగం చెవులు తయారుచేసి ఇస్తాడు. ఇది అతని వృత్తి. కానీ ప్రవృత్తి మాత్రం సాయంకాలం పూట రకరకాలైన కథలు చెప్పి ఊరిని అలరించటం. ఈ మనిషి మాట, తీరు, రూపం ప్రత్యేకంగా ఉంటాయి. సన్నగోలుగా, ఎత్తుగా బీగాల సంచి భుజాన వేసుకుని వక్క, ఆకు, పొగాకు నమిలి నమిలి ఎర్రబారిన నోరు, పళ్ళు. ఇవన్నీ ఒక ఎత్తయితే... ఈయన చెవులు మాత్రం డొప్పల్లాగా పెద్దవిగా వుండి ముందుకు వంగి ఉంటాయి. ఊరిలో పెద్ద చెవులుండే వారిని ఏడిపించాలంటే ... 'బీగాల సాయబు' అని పేరు పెట్టేవారు.

ఈయన వృత్తి కంటే ప్రవృత్తికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు ఊరిజనం. ఎవరి ఇంట్లోనైనా భోజనం పెడితే తింటాడు. లేకుంటే ఆరుబయట, పెద్ద అరుగు మీద, రామాలయం ప్రహరీ గోడకు ఆనుకుని కూర్చుని కథలు చెప్పటం ప్రారంభిస్తాడు.

కథల నిండా ఎప్పుడూ ఊరిజనం వినని రారాజులు, మహారాజులు, వారి అందచందాలు, శరీర సౌష్ఠవాలు, వారి అలంకారాలు, ఆభరణాలు, సౌభాగ్యం, విలాసవంతమైన జీవితం, పౌరుష గాథలు, ధన ధాన్య రాసులు, భూగర్భంలో వాళ్ళు దాచిన బంగారం, వెండి ఆభరణాలు, పట్టు వెండి జరీ చీరలు, వాళ్ళు రాసుకునే పౌడర్లు, సెంట్లు, పన్నీటిస్నానాలు, పంచ భక్ష పరమాన్నాలు ... అంతా కళ్ళకు కట్టినట్టు చెబుతూ ఉండేవాడు.

కథ వింటున్నంతసేపూ శ్రోతలు వేరే లోకంలో విహరిస్తూ .... తాము కూడా ఆ కథలో భాగస్వాములై ... ఆ పిండివంటలు ఆస్వాదిస్తూ... ఆభరణాలు ధరిస్తూ ... నిజ జీవితానికి దూరంగా ... తమను తాము పాత్రల్లో ప్రవేశపెట్టుకుని ఆనందించేవారు. నిజజీవితంలో రాగి సంగటి, 'బొటనవ్రేలి దరువు' తప్ప వేరే భోజనం ఎరుగని జనం ఈ కథను ఆస్వాదించటంలో ఆశ్చర్యం లేదు కదూ! ఇదే కూర, పప్పు, చారు ... అంతెందుకు పంచభక్ష పరమాన్నం ....

సంగటి చేసుకుంటారు. అందులోకి కూర ఉండదు. అప్పుడే అంగడికి పోయి ఒక 'బొట్టు'కు చింతపండు, ఎండు మిరపకాయలు, తెల్లగడ్డలు తెచ్చుకుంటారు. ఎండు మిరపకాయలను ఉడుకు బూడిదలో ఉంచి ... చింతపండును పళ్లెంలో వేసి బొటనవ్రేలితో నలుపుతూ ... బూడిదలో కాలిన మిరపకాయల్ని, తెల్లపాయల్ని, చింతపండును, ఉప్పును పళ్లెంలో ఒక మూలన వేసి బొటనవేలితో నిలుపుతారు.

(ఇంకా వుంది)



# భాగవతులతో అనుబంధం

శ్రీవేంకటాచార్యులు

స్త్రీ పురుష భేదం లేకుండా జన్మతః ఏ కులంలో అవతరించినవారైనా భగవంతుని పట్ల భక్తితో భగవత్ సంబంధీకులుగా గుర్తింపబడేవారు భాగవతులు. వీరితో అనుబంధం వల్ల మోక్షంతో సహా సకల కోర్కెలు నెరవేర్చుకోవచ్చు. వీరిపట్ల ద్వేషం తో, స్వార్థంతో అపచారం చేశామా నశిస్తాము.

తిరుక్కురుంగుడి క్షేత్రమునకు కొంత దూరంలో ఛండాలకులంలో అవతరించిన కౌశికుడు అనే మహా-భక్తుడు నివసిస్తున్నాడు. ఇతడు అడవిమార్గం గుండా గుడికి తానూ పంచముడన్న భావముతో తగినంత దూరంగా ఉండి, తన వీణాగానంతో స్వామివారిని మేలుకొలిపి ఎవరికం-టా పడకుండా తెల్లవారేసరికి ఇంటికి చేరేవాడు. తిరుక్కురుంగుడి ఒక దివ్య దేశం. ఇచ్చటి మూలవరుల-ను వైష్ణవ నంబి అని, ఉత్సవరులను సుందర పరిపూర్ణన్ అనీ, అమ్మవా-రిని కురుంగుడివల్లి తాయారు అనీ పిలుస్తారు. ఇక్కడ స్వామి తన భక్తు-లకు మూడు స్థితులలో దర్శనం ఇస్తారు. 1) నిన్దనంబి (నిలుచున్న మూర్తి), 2) ఇరుందనంబి (కూర్చు-




న్న మూర్తి), 3) కిదండనంబి (శయ-నించిన మూర్తి). అంతే కాదు, ఈ స్వామిని కురుంగుడి నంబి, వైష్ణవ నంబి, తిరుప్పార్ కడల్ నంబి, మలై మేల్ అని కూడా పిలుస్తారు. ఈ క్షేత్రంలో వామనుడు నివసించి-నందున కురుంగుడి సిద్ధాశ్రమమని పేరు వచ్చింది. బలి చక్రవర్తి నుండి వామనుడు మూడు అడుగుల దానం కోరుకుని ఒక అడుగుతో భూమిని అంతా కొలిచి, రెండవ అడుగుతో ఆకాశాన్ని కొలుస్తూ ఉండగా బ్రహ్మదేవుడు ఆ పాదాన్ని కడుగుతున్న సమయంలో కొన్ని

నీటి బిందువులు ఈ క్షేత్రంలో పడి, శిలమారు అనే నదిగా మారి దక్షిణ సింధు నదిగా కీర్తింపబడుతోంది. నారాయణుడు నరునకు తిరు-మంత్రం ఉపదేశించిన చోట బదరీ క్షేత్రం. రామానుజులు తిరుక్కురుం-గుడి క్షేత్రానికి వచ్చి స్వామిని సేవిం-చాలని వస్తే, ఆ స్వామి వడుగ నంబి రూపంలో రామానుజుల శిష్యునిగా చేరి ద్వయమంత్రాన్ని వేదసారాన్ని గ్రహించినందున దక్షిణ బదరి గా గుర్తింపబడుతోంది.

(ఇంకా వుంది)

# గడి - నుడి

చాగంటి కృష్ణకుమారి




## సూచనలు:

2. నిండు పున్నమి చంద్రుడు ( 4)

3. పెళ్ళివారు నడిచే నడక (2)

4. పెరుగులో బాగా ఎక్కువ నీళ్లు కలిపి గిలకరిచు ? (7)

5. నడి సముద్రములో నడి రాత్రి ప్రయానిస్తు-న్న వారంతా ఆ వయస్సు లో నున్నవారే (2) పైనుండి కిందకి

6. స్ఫుటముగా కనపడు తలాలతో ఏర్ప-డితే ఆ స్ఫాటికాలను--- --- స్ఫాటికాలు అంటారు (automorphic crystals) ఉదాహరణకి పైరైట్ స్ఫటికాలు , మంచు స్ఫటికాలు అలా ఏర్పడుతాయి. (7)

7.ఇనుప రేకు ఒక కర్రకు బిగించి ఉన్న చేతి పనిముట్టుప్రధానంగా వ్యవసాయదారులు వాడుతారు(2)

11.- -- పండితే కరువు తీరుతుంది (2)

## నిలువు:

పైనుండి కిందకి

12. బల్లెము , జావెలిన్ (3)

13. తలుపులకు బందులు వుంటాయిక-దా! వాటిలో వూడొచ్చినదానిని రా రమ్మని పిలువు. అదే రెక్కలు చప్పుడు చేస్తూ వస్తుంది (పైనుండి కిందకు ) (3)

14. శాస్త్రీయ నామము Cuminum cyminum (4) కిందనుండి పైకి

16. చెరకు నుండి రసం తీసిన తరువాత మిగి-లిపోయేది (2) కిందనుండి పైకి

17పంచపాండవులెందరంటే మంచం --- లాగ ముగ్గురు అని రెండు వేళ్ళు చూపాడట !(2) (కిందనుండి పైకి)

18. లేహ్యము (2) (కిందనుండి పైకి)

19 బావ ని పిలువు .(2)

## సూచనలు:

## అడ్డము:

1. వెనకకు తిరిగి రావడము, ఉ దాహరణ: పునర్జర్మ,గో-డకు కొట్టిన బంతి వెనకకు రావడం (7)

5.రెండు ఎద్దుల మెడ మీద ఉంచే కర్ర తిరగబడింది (2)

7. క్షీరము (2) వెనకనుండి ముందుకి(2)

8 చంద్రుడు (3)

9 వయసు(2)

10. ఫలితాలను గమనించడానికి రసాయన ప్రయోగం-లో మార్పు కొంటూ ప్రయోగాలు చేసీ చూసే ఉష్ణో గ్రత, గాడత వంటి రాశి ని ఇలా అంటారు ( variable )(4)

11. దిక్కు (2)

13 .మచ్చల జింక(2)

14నున్నగా పొడవుగా స్థూపాకారం లో వుండే ఒక కర్ర పరికరం. స్కేలు లాగే దీనిని కూడా తెల్ల కాగితాలలో రూళ్లు గీయడానికి, వాడవచ్చు(వెనకనుంచి ముందుకి)( 4)

15."సార్కాప్టిస్ స్కేబీ"(Sarcoptes scabei) పరాన్న జీవి వల్ల వచ్చే అంటు వ్యాధి(వెనకనుం-చి ముందుకి)(2)

16. పేసరిడే కుటుంబానికి చెందిన చిన్న పక్షి శాస్త్రీయ నామం: Passer domesticus(3)

17--తాపాలు మానిపరస్పరం క్షమాగుణం అల-వర్చుకోగలిగితే మానవ సంబంధాలు మెరుగు పడతాయి(2)

19 బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్య లో వున్నదో తిరగబడ్డ పత్రిక .(2)

20. సముద్రములో నివసించే జీవాలు (7)

---

## డిసెంబరు నెల గడి -నుడి సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| సి | ల్వ | ర్ | క్లో | రై | డ్ | | ఢో | కా |
| | | ల్ప | | | ఉ | లి | | ర్బ |
| డ్ | ల్పై | స | | ప్ర | | ఆ | క్టే | న్ |
| క్సయ్ | | | కాం | చ | న | | | డ |
| నా | నే | న్ | | లి | | కా | ద | యా |
| మో | | | ఘా | త | ము | | | క్సయ్ |
| న్ | టే | పెం | | ము | | క్రో | మై | డ్ |
| ర్బ | | పు | వా | | | మి | | |
| కా | ఫీ | | ట్ | ల్పై | స | యం | రి | బే |

# లలిత గీతాల తృష్ణ-డా.వడ్డేపల్లి కృష్ణ



తుమ్మూరి రాం మోహనరావు

"పల్లవించే హృదయాలు తక్కువ
బండవారే హృదయాలే ఎక్కువ
వడ్డెపల్లి కృష్ణది
పల్లవించ హృది"


అంటారు దాశరథి లలిత గేయ ,సినీ గీత రచయిత డా.వడ్డేపల్లి కృష్ణ గురించి.

"ఏళ్ల తరబడిగా,ఎన్నెన్నో గీతాలను రాశులుగా పోస్తున్న నిత్య వికచ ప్రతిభామూర్తి డా.వడ్డేపల్లి కృష్ణ. అని అంటారు సినారె వీరి గురించి ఆయన లలిత గీతాల పరిశోధనగ్రంథానికి ఆమోదం ప్రకటిస్తూ. పాట నాడిని క్షుణ్ణంగా తెలుసుకున్న పరిశోధన ప్రవీణతకు ఈ గ్రంథం నిలువుటద్దం అంటారు అదే లేఖలో.

అలాగే అక్కినేని నటించిన 'పిల్ల జమీందారు'కోసం రాసిన గీతం
" నీ చూపులోన విరజాజి వానా
ఆ వానలోన నే తడిసేనా హాయిగా"
అనే పాటను ప్రస్తావిస్తూ ఏయన్నార్ వడ్డెపల్లిని ప్రస్తుతించటం ఆయన ప్రతిభా శాలీనతకు తగిన ప్రశంస.

బహుముఖీనమైన ఈయన సాహిత్య వికాసాన్ని ఎంతో చక్కగా వింగడించారు బి.ఎస్.రాములు మాజీ తెలంగాణ తొలి బి.సి.కమిషన్ ఛైర్మన్ ఆయన సాహిత్య స్వర్ణోత్సవ-సంచికలో.

అంశాలతో ముప్పైకి పైగా పుస్తకాలు ప్రచురించిన డా.వడ్డేపల్లి కృష్ణ సాహిత్యరంగంలోన కాకుండా ,బుల్లితెర,సినిమా రంగాలలో కూడా తమదైన ముద్రవేసుకున్నారు.



వృత్తి రీత్యా తంతి తపాలా శాఖలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసిన వడ్డేపల్లి,అటు ఉద్యోగం చేస్తూనే సాహిత్య పరంగా అంచెలంచెలుగా ఎదిగారు.వైవిధ్యభరితమైన

దాదాపు రెండు వందల దాకా సినీగీతాలు రాసి లబ్ధ ప్రతిష్ఠులు చేప్రశంసలు పొందిన వీరు అనేక గేయ నాటికలు రాసారు.తెలంగాణ ఏర్పడిన తరువాత వీరు రాసిన 'జయహోతెలంగాణ'గేయ నాటిక

పలుచోట్ల ప్రదర్శించబడి అశేషాదరాభి మానాలను చూరగొన్నది.'వడ్డేపల్లి రూపకాలు' పేరిటవెలువడిన సంగీత నృత్య రూపకాల పుస్తకంలో స్వదేశీయం, విశ్వకల్యాణం, వివేకానంద విజయం,ఆమ్రపాలి, మాతృదేవో భవ-పితృదేవతలక భవ,శ్రీకృష్ణ దేవరా యలు,స్వర్ణ భారతి- నృత్య భారతి,సంక్రాంతిలక్ష్మి,ఉగాది వేళ వసంత హేల,చండాలిక, మానవత్వం వంటి రూపకాలున్నాయి. ఇవేగాక ఎయిడ్స్ మీద రూపొందించిన 'వెన్నెల వెల వెల'రూపకం బాగా ప్రాచుర్యాన్ని పొందింది.

మాడరన్ ట్రెండ్ ను దృష్టిలో పెట్టుకుని మాటలు,పాటలు,స్క్రీన్ ప్లే తో పాటు దర్శకత్వంకూడా వహించిన వీరి చలన చిత్రం 'లావణ్య విత్ లవ్ బాయ్స్ 'ఆశించిన విజయంసాధించలేకపోయినా వీరి దర్శకత్వ ప్రతిభకు మచ్చు తునక అని చెప్ప వచ్చు.


ఇక వీరి కవిత్వం విషయానికి వస్తే సరళ సుబోధకమై లలిత పదాన్వితమై ఒప్పుతుంది. మచ్చుకు

**'ఉద్యోగం పురుష లక్షణం**
**ఉత్సాహం మంచి లక్షణం**
**ఉపకారంగా జీవించడమే**
**ఉత్తమమైన మనిషి లక్షణం'**

ఇది రుబాయీ లక్షణాన్ని సంతరించుకున్న మాత్రాచ్ఛందో కవిత.

**'ఊరూరా ఉన్న చెరువు**
**తీర్చునురా నీటి కరువు**
**పల్లె పల్లె కూ చెరువు**
**ప్రగతి బాటకు దరువు'**

గేయ ప్రక్రియలో ఆరితేరిన వడ్డేపల్లి కొన్ని గజల్స్ కూడా రాశారు. పఠితలను ఆకట్టుకునే విధంగా ఉండే ఈ గజల్ మత్లాచూడండి.



**'కారుకన్న వేగమైనదెప్పుడూ పుకారు**
**కావాలని అందులో జనం చేస్తారు షికారు'**

దీన్ని బలపరిచే తరువాతి చరణం చూడండి:

**'రాజకీయవేత్తలపై సినీతారల జతలపై రాజుకునే కట్టుకథలు రోజ రోజు తయారు'**

శబ్దం మీద మంచి పట్టున్న వారికే ఇలా పదాలతో గారడీలు చేయ గల సమర్థతచేకూరుతుంది.


చిరుగజ్జెలు అనే బాలగేయాల సంపుటితో బాలసాహిత్యంలో కూడా తన ప్రతిభనుచాటుకున్నారు. ఇటీవలే పిల్లల కోసం రాసిన 'గేయ రామాయణం' విడుదలైంది. ఇటీవలపలు పత్రికలలోవీరి బాల గేయాలు ప్రచురితమవుతున్నాయి. అన్వయ క్లిష్టత లేని వీరిబాల గేయాలు ఒక్కోసారి వీరిని పిల్లల స్థాయికి తీసుకు వెళ్లటం కూడా జరుగుతున్నది.చదువ గానే పిల్లలకు ఎవరూ విప్పి చెప్పాల్సిన అవసరం రాకూడదనే విషయం-ఆలోచించ తగినదే. దేశ విదేశాలలో జరిగిన అనేక సాహితీ సభలలో పాల్గొని సన్మానసత్కారాలు పొందిన సత్కవి డా.వడ్డేపల్లి కృష్ణ. వీరి పుస్తకాల జాబితానే పెద్దదనుకుంటే సన్మాన సత్కారాల చిట్టాఅంతకు నాలుగింతలు పెద్దది. 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే ' అన్నట్టు వీరి కృషికి ఫలితంవీరు పొందిన పురస్కారా లని చెప్పవచ్చు.

**రాజన్న సిరిసిల్లా జిల్లా**
**రాజిల్లు రమణీయ జిల్లా'**

అని తెలంగాణ లో కొత్త జిల్లాలు ఏర్పడ్డపుడు ఈయన తనస్వంత జిల్లా గురించి పాట రాశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 1948 సంవత్సరం అగస్టు 5 న వడ్డెపల్లి లక్ష్మమ్మ, లింగయ్య దంపతులకు జన్మించిన వడ్డెపల్లి పాఠశాల విద్యనుఅక్కడే

పూర్తి చేశారు. జ్ఞాన పీఠ పుర-స్కార గ్రహీత సి.నారాయణ రెడ్డి గారిది ఈ జిల్లాయే కావడంవిశేషం. ఈయన తొమ్మిదవ తరగతి చదివే సమయంలో పాఠశాల వార్షిక సం-చికతరంగిణిలోవడ్డేపల్లి రాసిన 'వి-ధిలిఖితం' అనే కథ ప్రచురితమైం-ది.ఇది ఈయన తెలిరచనగా చెప్ప వచ్చు.H.S.C.లో ఫస్టు ర్యాంకులో ఉత్తీర్ణుడవటంతో తంతి తపాలా శా-ఖలోఉద్యోగం లభించింది.ఉద్యోగం చేస్తూనే P.U.C. B.A.,M.A..Ph.d. చేసిన ప్రజ్ఞాశాలి వడ్డేపల్లి.బడిలో చదువుకొనేప్పుడు తెలుగ పండితు-లునందగిరి అనంతరామ శర్మ, కవి కనపర్తి లక్ష్మీ నర్సయ్యాలు గురువులు కాగా, పి.యు.సి.చదివే రోజుల్లో నారాయణ రెడ్డి గారి ప్రాపు దొరికింది. వడ్డెపల్లి గారి శ్రీమతిమణి,కుమా-ర్తె వాణి,కొడుకులు శ్రీనాథ్,శ్రీకాం-త్ లు కాగా అందరికీ వివాహాలు జరిగి పిల్లాపాపలతో స్థిరపడ్డారు. కుమారులు ఇద్దరూ అమెరికా లో ఉండటంతో అనేక సార్లుఅమెరికా పర్యటన చేసే అవకాశం కలిగింది. అలా వెళ్లినప్పుడల్లా అక్కడి సాహి-తీసంస్థలతో అనుబంధం ఏర్పడి అనేక సాహిత్య కార్యక్రమాల్లో పా-ల్గొనటం జరిగింది.

కాగజ్ నగర్ లో ఆలిండియా




రేడియోలో లలిత గీతాలు పాడే గాయకులు ఇద్దరుండేవా-రు. అందులో ఒకరు రంగనాథ్ మరొకరు. వాళ్లిద్దరూ నాకు మంచి-స్నేహితులు. వాళ్లకు రేడియో ప్రో-గ్రామ్ రాగానే లలిత గీతాలు ఎన్ను-కుని బాణీ కట్టి, అంతా అయిన తరువాత నాకు వినిపించేవారు. చాలా సార్లు వారి నోటిగుండా వడ్డేప-ల్లి పేరు విన్నాను. ఆ తర్వాత చాలా ఏండ్లకు సురేష్ కుమార్ మంచి-ర్యాలలో చాలా పెద్దఎత్తున సాం-స్కృతిక వైభవాలు ఏర్పాటు చేశారు. అందులో సాహిత్య విభాగం నా-కుఅప్పజెప్పారు. అందులో భాగం పలువురు ప్రసిద్ధ కవులను ఆహ్వా-నించటంజరిగింది. అలా వచ్చిన వారిలో బాపురెడ్డి వడ్డెపెల్లి ఉన్నారు. వ్యాఖ్యలత గా వారిపరిచయం చేసి, సన్మాన సత్కారాదులు చేయటం జరిగింది. అదిగో అప్పుడు చూశాను వడ్డేపల్లిని మొదటిసారి. ఆ తరువాత ఏకంగా న్యూయార్క్ లో వాళ్ల అబ్బాయి ఇంట్లో కలుసుకుని ఓ విషయం మీద చాలా సేపు మా-ట్లాడుకున్నాము. ఇక ఆ తరువాత-హైదరాబాదులో చాలా సార్లు చాలా సందర్భాల్లో కలుసుకున్నాం.ఓ సారి ఆయన ఇంటికివెళ్లినపుడు ఆయన పుస్తకాలు ఇచ్చారు. అందులో ఆయన లలిత గీతాల పుస్తకాలతో-పాటు లలితగీతాల మీద పరిశోధన చేసిన సిద్ధాంత గ్రంథం కూడాఉంది. అనేక వ్య ప్రయాసల కోర్చి ,అత్యంత విలువైన సమాచారా న్నందించారు. లలితగీతాల పుట్టు పూర్వోత్తరాలు-,లలిత గీతాల నడకలు, మాత్రా-ఛందస్సు, తాళగతులు ఇలా అనేక విషయాలను స్పృశించిన పరిశోధన గ్రంథం.

లలితగీతాలతో మొదలయిన ఆయన రచనా ప్రస్థానం అనేక గే-

యనాటికలు,ఆ పైసినిమా గీతాల రచనదాకా వెళ్లింది. ఇటీవల సప్తతి లో అడుగిడిన డా.వడ్డేపల్లి కృష్ణసాహిత్య ప్రస్థానం స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకున్నది. ఈయన పరిచయం ఆలస్యంగాజరిగినా అచిర సమయంలోనే ఆత్మీయమ యిందనడానికి నిదర్శనం ఆయన దర్శకత్వంవహించిన 'లావణ్య విత్ లవ్ బాయ్స్ 'లో నాకు తొలిసారి సినిమాలో నటించే అవకాశంకల్పించడమే.అందుకు ఆయనకు సర్వదా కృతజ్ఞుడిని.

ఈయన రచించిన అనేక గేయాలు అనేక మంది లలిత సంగీత గాయనీగాయకుల చేత ఆలాపించబడ్డాయి. ఆ తరువాత వచ్చిన టి.వీ. ఛానల్స్ లో ఈయనప్రత్యక్షం గా పరోక్షంగా తన స్థానాన్ని పెంచుకున్నారు.కవి సమ్మేళనాల్లో, ఉగాది సంబరాల్లో,సంక్రాంతి వేడుకల్లో,దసరాఉత్సవాల్లో ఇలా వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.కొన్ని టీ విసీరియల్లకు పాటలు రాయటమే గాక స్వయంగా కొన్ని లఘు చిత్రాలునిర్మించారు. బహుముఖ ప్రజ్ఞశాలియైన వడ్డేపల్లి ఇప్పటికీ ఎక్కడో ఒకచోట కనిపిస్తూనేఉంటారు.మితభాషి,స్నేహపాత్రుడు



డా. వడ్డేపల్లి కృష్ణ

కలగలుపు మనిషి అయిన ఈ కవి రాసిన పుస్తకాలు చాలా ఉన్నాయి. వాటిని పలువురు ప్రముఖులకు అంకితమిచ్చి ప్రతిష్ఠ పెంచుకున్నారు.

కనరా నాదేశం వీరి తొలి గేయసంపుటి.ఆ తరువాత'యువస్వరాలు','అంతర్మథనం','వెలుగుమేడ,'వసంతోదయం','రాగరథం','మనసాతెలుసా',మబ్బుల పల్లకి',పాటవెలదులువంటి అనేక గేయ,వచన కవితా సంపుటులువెలువరించారు.తెలుగులో లలిత గీతాలు వీరి పరిశోధనా గ్రంథం కాగా వీరి వడ్డేపల్లగేయవల్లి కి తెలుగు విశ్వ విద్యాలయం సాహిత్య పురస్కారంలభించింది.బతుకమ్మ,జయజయహో తెలంగాణ వీరి నృత్యరూపకాలు.

గేయ కిరీటి బిరుదుతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వీరినిసత్కరించింది.ఇంకా ఎన్నో సంస్థలు వీరిని బిరుదులతో,సన్మాన సత్కారాలతోగౌరవించాయి.

వీరు పిల్ల జమీందార్,భారవ ద్వీపం,అమృత కలశం,పెద్దరికం,అందరూఅందరే,పెళ్లిల్లోయ్ పెళ్లిల్లు,ఏంటి బావా మరీను వంటి పలు చిత్రాలకు గీతాలు రాశారు.ఎంత రాసినా తక్కువే అన్నట్లు ఇలాంటి లబ్ధప్రతిష్ఠుల గురించి ఎంతనిరాయగలం.వీరినుండి ఇంకా అనేక రచనలు ఇంకా వెలువడాలని కోరుకుంటూ వ్యాసంముగిస్తాను.


CEAT
అద్భుతమైన ఆటతో రెండవ టెస్ట్ లో
భారత్ ను గెలిపించిన టీమ్ సారథి
రహానే


RNI No. TEL
Date of Publication: 1st
Date of Posting:
8th January
సంక్రాంతి శుభాకాంక్షలు
Published, Edited and Printed by T. Shanti at Flat No.
Phone 9490571297 email:
Printed at Planographers, 5-8-200,